జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శనివారం 18 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక :185 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం విశేషం: అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం, స్కంద పంచమి సూర్యోదయం: 5:35 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 9:14 । చంద్రాస్తమయం: 9:49 తిథి: శుద్ధ చవితి ఉ. 8:35 వరకు, తదుపరి పంచమి నక్షత్రం: పుబ్బ రా. 10:32 వరకు, తదుపరి ఉత్తర యోగం: వరియాన్ రా. 1:49 వరకు, తదుపరి పరిఘ కరణం: బవ ఉ. 8:35 వరకు, తదుపరి బాలువ రా. 8:06 వరకు, తదుపరి కౌలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

## ఆ బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం

- పార్లమెంట్ సమావేశాలపై చీణూ వ్యూహరచన
- దిల్లీలోని కర్తవ్యభవన్‌లో సమావేశమైన ఎన్‌డీఏ కూటమి
- రానున్న వర్షకాల సమావేశంలో ప్రభుత్వ విధివిధానాలపై సాగిన చర్చలు
- ప్రవేశపెట్టబోయే బిల్లులపై కసరత్తు చేస్తున్న కూటమి
- డీలిమిటేషన్‌పై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్న డీఎంకే



## ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి

- పంజాబ్ ప్రభుత్వంపై మోదీ ధ్వజం
- ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజం
- పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని వ్యాఖ్య
- ప్రభుత్వాన్ని నడుపుతున్న పెద్దలు ఆ నిధులను తమ సొంత పనులకు వాడుకుంటూ ప్రజాధనంతో విలాసాలు అనుభవిస్తున్నారు



# అర్హులందరికీ రుణాలు



- 5 లక్షల మందితో ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేలా చర్యలు: సీఎం చంద్రబాబు
- అర్హులైన అందరికీ రుణాలు అందించడమే రుణమేళా ఉద్దేశం
- ఒకప్పుడు బ్యాంకు రుణం కష్టమైన పని
- ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వెళ్లి రుణాలు ఇస్తున్నాయి
- పల్నాడు జిల్లా రుణ మేళా కార్యక్రమంలో చంద్రబాబు

**అమరావతి**

బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదు, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువకుడి ఆశయానికి, మహిళా సాధికారతకు ఈ రుణాలు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే క్రెడిట్ అవుట్‌రీచ్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో నేడు జరిగిన భారీ రుణ మేళా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. స్థానిక కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో జరిగే సభలో పాల్గొని రూ. 3,216 కోట్ల రుణాలను రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "పల్నాడు పౌరుషానికి శక్తిమంతమైన - మిగతా3లో



## భారతదేశ అభివృద్ధిలో రైల్వే శాఖది కీలక పాత్ర

- మోదీ ముందు చూపుతో రైల్వే అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు
- మోదీ నాయకత్వంలో వందేభారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ సాంకేతికత
- మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్

**అమరావతి**

అమరావతిని గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయటం అందరి లక్ష్యం కావాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఇప్పుడు అభివృద్ధి చెందిన హైదరాబాద్‌ను చూస్తుంటే అసూయ కలుగుతోందన్నారు. ఆ అసూయే కసిని పెంచి రాష్ట్రాన్ని దక్షిణ భారత దేశంలో నెంబర్-1 స్థానంలో నిలబెట్టాలనే తపన పెంచిందని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సహకారంతో లక్ష్య సాధనకు కలసి కట్టుగా పని చేద్దామని లోకేశ్ పిలుపునిచ్చారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద సరికొత్త - మిగతా3లో



## ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేయాలి

- లిస్టింగ్ చేయాలంటూ సుప్రీంను కోరిన పిటిషనర్
- ఉచితాలపై దాఖలైన పిల్‌ను త్వరగా విచారించాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి
- 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం




## మెక్సికోలో భారీ భూకంపం

- మెక్సికో దక్షిణ పసిఫిక్ తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన భూకంప తీవ్రత
- గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వరకు కంపించిన భూమి



## పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు

ఈ నాలుగు అన్యాయాలపైనే పోరాడాలి' : విద్యార్థులతో రాహుల్ గాంధీ

విద్యార్థులు 4 రకాల అన్యాయాల్ని ఎదుర్కొంటున్నారు:

దెహ్రాదూన్‌లో ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడిన రాహుల్ గాంధీ

పేపర్ లీక్స్ నిజాయతీ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని వ్యాఖ్యలు

# 'సర్' సవరణలో మళ్లీ జల్లెడ

- అన్‌కలెక్టబుల్ ఓటర్ల వివరాలపై పునఃపరిశీలన
- జులై 14 నాటికి అన్‌ట్రేసబుల్ జాబితాలో 8.24 లక్షల మంది
- శాశ్వత వలసల విభాగంలో 13.34 లక్షలు
- సర్ గడువు పొడిగింపుతో మరోసారి జల్లెడ పడుతున్న బీఎల్‌వోలు



**అమరావతి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా "అన్‌కలెక్టబుల్"గా నమోదు చేసిన ఎన్యూమరేషన్ పత్రాలపై ఎన్నికల యంత్రాంగం మరోసారి దృష్టి సారించింది. తొలిదశలో అందుబాటులోకి రాలేదని డిజిటలైజ్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పుడు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి తిరిగి పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం గడువును - మిగతా3లో

## ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలి



- రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించాలి: సీఎస్
- ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- రైతులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఎల్‌నినో పరిస్థితులపై సీఎస్ సాయిప్రసాద్ ఉన్నతస్థాయి సమీక్ష

**అమరావతి**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు క్షేత్రస్థాయిలో తీసుకోవాలని - మిగతా3లో



## పౌరసత్వ నిర్ధారణకు ఆ పత్రాలు చెల్లవు

- పౌరసత్వానికి భూమి పత్రాలు ఆధారం కాదని కలకత్తా హైకోర్టు తీర్పు
- చోరబాటు ఆరోపణలతో అరెస్టయిన వ్యక్తి పిటిషన్‌పై విచారణ
- సరైన పౌరసత్వ ధ్రువపత్రాలు సమర్పించాలని పిటిషనర్‌కు ఆదేశం
- ఆధార్, ఓటర్ ఐడీ వంటివి కూడా పౌరసత్వానికి నిశ్చయమైన ఆధారాలు కావని స్పష్టం

# ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఊహించలేని పరిస్థితి



పవిత్ర భూమి పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంలో నేరగాళ్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా 20 రాష్ట్రాల్లో అత్యాధునికంగా ఆధునీకరించిన 75 రైల్వేస్టేషన్లను ప్రధాని మోదీ జలంధర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.5,470 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన మోదీ ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో పంజాబ్‌లో అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆరోపించారు. పంజాబ్ రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని నడుపుతున్న పెద్దలు ఆ నిధులను తమ సొంత పనులకు వాడుకుంటూ ప్రజాధనంతో విలాసాలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లో మార్పును తీసుకురావడం కేవలం బీజేపీ వల్ల సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. సుసంపన్నమైన పంజాబ్ నిర్మాణానికి కేంద్రం అంకితభావంతో పనిచేస్తుందని మోదీ భరోసా ఇచ్చారు. పంజాబ్‌లో ఈరోజు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని రహస్యమేమీ కాదు. ఇక్కడ జరుగుతున్న ద్రోహపూరితమైన వాస్తవాలను ప్రకటనల ముసుగులో దాచేందుకు ప్రయత్నిస్తున్నారు. పంజాబ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఎప్పుడు, ఎక్కడ గ్యాంగ్ వార్స్ భగ్గుమంటాయో, ఏ దిక్కు నుంచి బుల్లెట్లు దూసుకొస్తాయో ఎవరూ ఊహించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారాలు చేయడం కష్టంగా మారింది. చివరికి పోలీసు స్టేషన్లకు కూడా రక్షణ లేదు. వాటిపై పదేపదే దాడులు జరుగుతున్నాయి. అత్యంత విషాదకరమైన విషయం ఏంటంటే పంజాబ్ భవిష్యత్తు నాశనమవుతోంది. డ్రగ్స్ విక్రేతలు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనాల ఊబిలోకి నెట్టేస్తున్నారు."

**'కట్టర్ బేమాన్' పార్టీ**

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని 'కట్టర్? బేమాన్ పార్టీ'(అత్యంత అవినీతిపూరిత పార్టీ)గా మోదీ విమర్శించారు. "ప్రజలకు సేవ చేయాలంటే నిజాయతీ ఉద్దేశాలు, సమగ్రతా స్ఫూర్తి అవసరం. అయితే, పంజాబ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీకి ఈ రెండూ లేవు. దానిని కట్టర్ బేమాన్ పార్టీ అని పిలుస్తారు" అని మోదీ అన్నారు. పంజాబ్ యువతకు అత్యంత తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆరోపించారు. పంజాబ్ భవిష్యత్తు నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల వ్యాపారులు స్వేచ్ఛగా తిరుగుతూ, పంజాబ్ యువతను వ్యసనం అనే చిత్తడిలోకి లాగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిజాయతీ, సమగ్రత కొరవడ్డాయని మోదీ అన్నారు.

**కేంద్ర నిధుల దుర్వినియోగం**

కేంద్రం ఏళ్ల తరబడి పంజాబ్‌కు భారీ మొత్తంలో డబ్బు పంపిందని, అయితే ఆ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆరోపించారు. " పంజాబ్ ప్రజలు తమ పథకాలన్నింటి నుంచి ప్రయోజనం పొందేలా కేంద్ర ప్రభుత్వం సాధ్యమైన అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. అయినప్పటికీ, ఈ 'కట్టర్ బేమాన్ పార్టీ' పాలనలో దోపిడీ ఆట సాగుతోంది. గత 12 ఏళ్లలో కేంద్రం పంజాబ్‌కు లక్షల కోట్ల రూపాయల నిధులను పంపింది. పంజాబ్ ప్రభుత్వం ఆ డబ్బును సక్రమంగా వినియోగించడంలో విఫలమైంది. పంజాబ్ పేరుతో రుణాలు తీసుకుంటున్నారు. ఈ అప్పుపై వడ్డీ చెల్లింపులకే రాష్ట్ర బడ్జెట్ ఖర్చవుతుండగా, ప్రభుత్వాన్ని నడుపుతున్న వారు అదే డబ్బుతో విలాసవంతంగా జీవిస్తున్నారు" అని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ అధికారులపై దాడి, దోపిడీకి పాల్పడినందుకు ఆప్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గుజరాత్ కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు గురించి మోదీ ప్రస్తావించారు. "కొద్ది రోజుల క్రితమే గుజరాత్‌లోని ఒక కోర్టు వారి ఎమ్మెల్యేలలో ఒకరికి 7 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం, దోపిడీకి పాల్పడినందుకు ఈ శిక్ష విధించారు. దోపిడీ, అక్రమ ఆక్రమణలు వారి రాజకీయ వ్యవస్థకు గుర్తులుగా మారాయి. ఇలాంటి అనేక కేసుల్లో చాలా మంది ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు. పంజాబ్‌నే చూడండి, ఆరోగ్య మంత్రిగా నియమితులైన వ్యక్తిని లంచం కారణంగా తొలగించాల్సి వచ్చింది. ఒక మంత్రి మనీలాండరింగ్ వంటి తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వారి ఎమ్మెల్యేలు లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నారు. మనం ఇలా లెక్కపెడుతూ పోతే, వారి ప్రభుత్వంలో, పార్టీలో ఎలాంటి మచ్చలేని వారు చాలా తక్కువ మందే మనకు కనిపిస్తారు" అని మోదీ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ గత వాగ్దానాలు, పనితీరును విమర్శిస్తూ, ఆ పార్టీ అసలు రంగులు ఇప్పుడు అందరికీ కనిపించాయని అన్నారు.

# ఆ బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఎన్?డీఏ ప్రభుత్వం వ్యూహరచనను వేగవంతం చేసింది. ఈ క్రమంలో దిల్లీలోని కర్తవ్య భవన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. జులై 20న జరగనున్న పార్లమెంట్ వార్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన విధివిధా నాలు, రెండు ఆర్డినెన్స్‌లను చట్టాలుగా మార్చడంపై ఎన్‌డీఏ కూటమి చర్చించింది. ముఖ్యంగా ఆదాయపు పన్నుసవరణ బిల్లు, గతంలో నెగ్గని డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లులను మళ్లీ పార్లమెంట్ ముందుకు తెచ్చేందుకు ఎన్?డీఏ కసరత్తు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ, పశ్చిమాసియా ఘర్షణల్లో భారతీయ నావికుల మృతి, అయోధ్య రామాలయ విరాళాల్లో అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

**ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' పేరు**

జులై 21న జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' అని ఎన్?డీఏ పేరు పెట్టింది. పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన ఎన్?డీఏ ఎంపీలందరూ హాజరుకానున్నారు. ప్రభుత్వ శాసనపరమైన అజెండా నేపథ్యంలో ఎన్?డీఏ నాయకుల ఈ సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గతంలో ప్రకటించినట్లుగా, ఆగస్టు 13 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాల్లో పలు ముఖ్యమైన బిల్లులను చేపట్టే అవకాశం ఉంది.

ఇదిలా ఉండగా, డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల పునర్విభజనపై కేంద్రం బిల్లు పెడితే అధ్యయనం చేసి, తమిళనాడు ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బిల్లు పరిధి, లక్ష్యాలు తెలిసిన తర్వాత విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు తెలిపాయి. తమిళనాడు ప్రయోజనాలు కాపాడేందుకు డీఎంకే తీసుకునే నిర్ణయం స్వతంత్రంగా ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వివరించాయి. డీలిమిటేషన్‌పై వర్షాకాల సమావేశాల్లో పెట్టే బిల్లు స్వతంత్ర చట్టంగానే ఉండే అవకాశం ఉందని, ఇతర చట్టాలతో కలిపి ఉండదని భావిస్తున్నట్లు తెలిపాయి. 50 శాతం సీట్ల పెంపు, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల పంపిణీ నిష్పత్తిని అలాగే కొనసాగించడం తదితర వంటి అంశాలు చర్చలో ఉన్నాయని పేర్కొన్నాయి. జులై 16న జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో డీలిమిటేషన్‌పై చర్చ జరిగింది. లండన్‌లో ఉన్న డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. హస్తం పార్టీతో పొత్తులేనందున బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండా స్వతంత్రంగానే నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు వివరించాయి.

**డీఎంకే, ఇండి కూటమిపై జైరాం రమేశ్ కీలక వ్యాఖ్యలు**

మరోవైపు, డీఎంకే, ఇండి కూటమికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్? మాట్లాడారు. "బీజేపీ, డీఎంకేల సిద్ధాంతాలు వేర్వేరు కాబట్టి అవి ఎప్పటికీ కలిసి పనిచేయలేవు. 8వ తేదీన జరిగిన ఇండి కూటమి సమావేశానికి డీఎంకే హాజరుకాలేదన్నది, అలాగే మేము టీవీకేకి మద్దతు ఇస్తున్నామన్నది వాస్తవమే. ప్రభుత్వంలో మాకు ఇద్దరు కేబినెట్ మంత్రులు కూడా ఉన్నారు. మేం డీఎంకే ఎంపీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం, చర్చలు కొనసాగుతున్నాయి. డీఎంకే ఇప్పటికీ ప్రతిపక్ష పార్టీయే తప్ప, అధికార పక్షం లేదా ఎన్?డీఏలో భాగం కాదు. స్టాలిన్ చేసిన ప్రకటనలను నేను చదివాను, బీజేపీ, డీఎంకేల మధ్య ఎలాంటి ఒప్పందం లేదని స్పష్టమవుతోంది. సరైన సమయం వచ్చినప్పుడు డీఎంకే కచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా నిలబడుతుందని నాకు నమ్మకం ఉంది" అని జైరాం రమేశ్? వ్యాఖ్యానించారు.

## పౌరసత్వ నిర్ధారణకు ఆ పత్రాలు చెల్లవు



పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి కేవలం భూమి లేదా ఆస్తి పత్రాలు మాత్రమే సరిపోవని కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చట్టవిరుద్ధమైన చొరబాటు ఆరోపణల ఉన్నప్పుడు ఇలాంటి పత్రాలకు ఎటువంటి చట్టపరమైన బలం ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది. దేశంలో పౌరసత్వ నిర్ధారణకు సంబంధించి అనుసరిస్తున్న న్యాయపరమైన వైఖరిని ఈ తీర్పు మరోసారి ప్రతిబింబించింది. చొరబాటుదారుడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్ పోలీసులు నసీర్ మొల్లా అనే వ్యక్తిని అరెస్ట్ చేసి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. రాష్ట్రంలో తాను భూమి కొనుగోలు చేశానని, కాబట్టి తనను భారత పౌరుడిగా గుర్తించాలని కోరుతూ అతని బంధువులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలను విన్నది. అయితే, విచారణలో తాను విదేశీయుడినని నిందితుడే స్వయంగా అంగీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో, ఆస్తి పత్రాలను పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని తేల్చి చెప్పిన కోర్టు, తగిన ఆధారాలను 2026 జూలై 20లోగా సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అంతవరకు నసీర్ మొల్లా డిటెన్షన్ సెంటర్‌లోనే కొనసాగుతారని స్పష్టం చేసింది. భారతదేశంలో ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, పాన్ కార్డు లేదా నివాస ధ్రువపత్రాలను పౌరసత్వానికి ప్రామాణికమైన ఆధారాలుగా పరిగణించలేమని గతంలో గౌహతి హైకోర్టు వంటి న్యాయస్థానాలు కూడా స్పష్టం చేశాయి. 1955 పౌరసత్వ చట్టం నిబంధనల ప్రకారమే పౌరసత్వాన్ని నిర్ధారించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా న్యాయ నిపుణులు గుర్తుచేస్తున్నారు.

## మెక్సికోలో భారీ భూకంపం..




మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్దాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి. "మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు. గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాదూన్‌లో నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గర్జన)' కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. దేశంలో విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ, పేపర్ లీక్స్, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, యువత ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఇది రాజకీయ సభ కాదని, విద్యార్థుల భవిష్యత్తు, వారి పోరాటం, విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశం అని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రస్తుతం నాలుగు ప్రధాన సమస్యల్ని, అన్యాయాల్ని ఎదుర్కొంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. మొదటిది చదువులకు ఖర్చు భారీగా పెరగడం, రెండోది యువతకు అందుబాటులో ఉండే 5 అవకాశాల్లో నాలుగు మార్గాల తలుపులు మూసుకుపోవడం, మూడోది వందలాది మంది పోటీపడినా ఒకరికో, ఇద్దరికో విజయం దక్కడం, నాలుగోది అత్యంత ప్రమాదకరమైన పేపర్ లీకులు అని పేర్కొన్నారు. వీటిపై పోరాడాలని పిలుపునిచ్చారు.

**ఉపాధి లేకపోవడానికి కారణాలివే!**

దేశంలో యువతకు ప్రతి 5 అవకాశాలకు 4 అవకాశాల తలుపులు మూసుకుపోయాయి. మొదటిది, భారతదేశంలో తయారీ రంగం పూర్తిగా నిలిచిపోయింది. చైనా ఉత్పత్తులే భారత మార్కెట్‌ను ఆక్రమించడంతో ఉపాధి అవకాశాలు తగ్గాయి. రెండోది– వ్యాపారం చేయాలనుకునే యువతకు బ్యాంక్ రుణాలు సులభంగా అందట్లేదు. బ్యాంక్ నిధులు కొద్ది మంది పెద్ద పారిశ్రామిక వేత్తలకే పరిమితమయ్యాయి. మూడోది– కృత్రిమ మేధ ప్రభావంతో ఐటీ, కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయి. నాలుగోది– ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఆ తలుపులు కూడా మూసేశారు. చివరగా ప్రభుత్వ ఉద్యోగాలే యువతకు మిగిలిన చివరి అవకాశం అయింది. అంతా ఈ డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. అయితే కోట్లాది మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తున్నప్పటికీ, చివరికి కొద్దిమందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. సుమారు 6 కోట్ల మంది ఈ ఒక్క డోర్‌వైపే పరుగులు తీస్తున్నారు. కానీ అందులో లక్షల మందికే అవకాశం వస్తోంది. మిగిలిన వారు నిరాశకు గురవుతున్నారు. ఇక్కడ పోటీ తీవ్రతతో పాటు విద్య ఖర్చు, పేపర్ లీక్స్ యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి.' అని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు.

దేశంలోని పరీక్షల నిర్వహణ వ్యవస్థ, పేపర్ లీక్‌లపై ఈ వేదికగా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పరీక్ష ప్రశ్నపత్రాల లీక్స్ కోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాలు టెలిగ్రామ్, సిగ్నల్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారంలలో అందుబాటులో ఉంటున్నాయని, అయితే వాటిని పొందాలంటే కోట్ల రూపాయలు చెల్లించే స్తోమత ఉండాలని వ్యాఖ్యానించారు. ఇదే ప్రస్తుతం భారతదేశ విద్యా వ్యవస్థ పరిస్థితి అని దుయ్యబట్టారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, సగటున ప్రతి నెల ఒక పేపర్ లీక్ అయినట్లేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటనల కారణంగా సుమారు 7.5 కోట్ల మంది యువత నష్టపోయారని వ్యాఖ్యానించారు. వరుస పేపర్ లీక్స్ జరుగుతున్నా ఇప్పటికీ ఒక్క కేసులో కూడా శిక్ష పడలేదని, ఒక్క వ్యక్తి కూడా జైలుకు వెళ్లలేదని రాహుల్ ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దందా మరింత పెరుగుతోందని అన్నారు.

**'పేపర్ లీక్స్‌తో నిజాయతీ విద్యార్థులకే నష్టం'**

'వ్యవస్థను కేవలం ఒక శాతం మంది మాత్రమే దుర్వినియోగం చేస్తున్నారు. కానీ దాని ప్రభావం నిజాయతీగా చదివే 99.9 శాతం మంది పేద, మధ్యతరగతి విద్యార్థులపై పడుతోంది.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఇక విద్యార్థుల ముందున్న రెండు మార్గాల్ని వివరిస్తూ– ఒకటి నిజాయతీ, కష్టపడి చదివే మార్గమైతే; మరొకటి డబ్బు, అవినీతి, మోసాల ద్వారా పేపర్ లీక్ మార్గం అని వ్యాఖ్యానించారు. ఈ మార్గంలో వెళ్లాలంటే– మధ్యతరగతి లేదా పేద కుటుంబానికి చెందినవారిగా ఉండకూడదని, నిజాయతీ అవసరం లేదని అన్నారు. అయితే 99.9 శాతం మంది విద్యార్థులు నిజాయతీ మార్గాన్నే ఎంచుకుంటున్నారని, కొందరు మాత్రమే వ్యవస్థను దుర్వినియోగం చేసి అందరినీ నష్టపరుస్తున్నారని అన్నారు.

## ఉచిత హామీలు ఇచ్చే పార్టీల గుర్తింపు రద్దు చేయాలి

ఎన్నికలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ప్రకటించే 'ఉచిత పథకాల' అంశం మరోసారి సుప్రీంకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. ప్రజాధనంతో అర్థరహితంగా ఇచ్చే ఉచిత హామీలు లేదా పంపిణీ చేసే రాజకీయ పార్టీల గుర్తును స్వాధీనం చేసుకోవాలని, అవసరమైతే వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) త్వరగా విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని న్యాయవాది, పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై ఇప్పటికే 2022లో కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఫిబ్రవరి 5న కూడా అత్యవసర విచారణ కోసం ఈ అంశాన్ని ప్రస్తావించామని, మార్చిలో విచారణకు అంగీకరించినప్పటికీ ఇంకా జాబితాలోకి రాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, ప్రస్తుతం కోర్టులో భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ అంశం కొంతకాలం వేచి ఉండాలని వ్యాఖ్యానించారు. దీంతో విచారణకు వెంటనే తేదీ ఖరారు కాలేదు. దీనికి స్పందించిన అశ్విని ఉపాధ్యాయ్, ఈ సమస్య దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుందని, దీనిపై అధ్యయనం చేసేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుపక్షాలు కూడా దీనికి అంగీకరించాయని ఆయన ధర్మాసనానికి వివరించారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా ఈ పిటిషన్‌పై త్వరిత విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు.

**2022లోనే నోటీసులు**

ఇదే అంశంపై 2022 జనవరి 25న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలు దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో వివరించాలని కోరింది. ఆ సమయంలో ధర్మాసనం ఈ అంశాన్ని "తీవ్రమైన సమస్య"గా అభివర్ణించింది. కొన్ని రాష్ట్రాల్లో ఉచిత పథకాల కోసం కేటాయిస్తున్న నిధులు సాధారణ బడ్జెట్ కంటే ఎక్కువగా మారుతున్నాయని కూడా వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో ప్రజాధనంతో సంబంధం లేని ఉచిత వస్తువులు, సేవలను ప్రకటించడం ద్వారా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధమని, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను దెబ్బతీస్తుందని పిటిషనర్ వాదించారు. అందుకే ఎన్నికల ముందు ఇలాంటి ఉచితాలను ప్రకటించే లేదా పంపిణీ చేసే పార్టీల ఎన్నికల గుర్తును రద్దు చేయాలని, అవసరమైతే పార్టీ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ప్రత్యామ్నాయంగా, ఈ అంశంపై స్పష్టమైన చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. 1968లో రూపొందించిన 'ఎన్నికల చిహ్నాల (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్'లో సవరణలు చేయాలని కూడా పిటిషన్?లో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజాధనంతో ఉచితాలు ప్రకటించకూడదనే నిబంధనను రాజకీయ పార్టీల గుర్తింపుకు సంబంధించిన అర్హతల్లో చేర్చాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు.

**రాజ్యాంగ విరుద్ధమని వాదన**

ప్రజా ప్రయోజనాలకు సంబంధం లేని వస్తువులు లేదా సేవలను ప్రజాధనంతో వాగ్దానం చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)తో పాటు ఆర్టికల్స్ 162, 266(3), 282లను కూడా ఉల్లంఘిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజాధనాన్ని ఎన్నికల లబ్ధి కోసం వినియోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వాదించారు. అధికారంలో కొనసాగాలనే ఉద్దేశంతో ప్రజాధనాన్ని వినియోగించి ఉచితాల హామీలు ఇవ్వడం, ఓటర్లకు లంచం ఇచ్చినట్లేనని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, అలాంటి ప్రక్రియను డబ్బు, ఉచిత హామీలతో ప్రభావితం చేయడం అత్యంత ప్రమాదకర ధోరణి అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# 'సర్' సవరణలో మళ్లీ జల్లెడ

-మొదటిపేజీ తరువాయి

ఈ నెల 24 వరకు పొడిగించడంతో, తొలిదశలో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జులై 14 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43,39,523 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ పత్రాలు 'అన్‌కలెక్టబుల్'గా నమోదయ్యాయి. వీరిలో 8,24,862 మంది అన్‌ట్రేసబుల్/ఆబ్సెంట్ లేదా ఇంట్లో లేరని, 13,34,877 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారని నమోదు చేశారు. అలాగే 6,39,545 మంది ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదయ్యారని, 81,811 మంది ఇతర కారణాలతో అందుబాటులో లేరని పేర్కొన్నారు. మరోవైపు 14,58,428 మందిని మృతులుగా నమోదు చేశారు. అయితే గత రెండు రోజులుగా అన్‌ట్రేసబుల్‌గా గుర్తించిన కొంతమంది ఓటర్లు అందుబాటులోకి రావడంతో, బీఎల్‌వోలు వారి వివరాలను సవరించి మళ్లీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వలస వెళ్లారని నమోదు చేసిన వారి వివరాలపైనా తిరిగి ధృవీకరణ చేపడుతున్నారు.




### హడావుడి ప్రక్రియపై విమర్శలు

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఇంటింటి సర్వే సమయంలో బీఎల్‌వోలు వారి బూత్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేయాలి. ఆ తర్వాత వివరాలు నింపిన పత్రాలను ఓటర్ల నుంచి సేకరించేందుకు మళ్లీ వెళ్లాలి. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల బీఎల్‌వోలు ఒక్కసారి కూడా వారి బూత్ పరిధిలోని ఇళ్లకు వెళ్ల లేదు. ఈసీ మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జులై 14 నాటికల్లా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, వాటి సేకరణ, డిజిటలైజ్ పూర్తి చేయాల్సి ఉండటంతో హడావుడిగా ముగించేశారు. గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్లు ఒత్తిడి చేయటంతో బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు వారి వద్ద పెండింగ్‌లో మిగిలిపోయిన పత్రాలకు ఏదో ఒక కారణం చూపించేసి డిజిటైజ్ చేసేశారనే విమర్శలున్నాయి.

ఇదిలా ఉండగా, 2002 ఓటర్ల జాబితాలో తమ కుటుంబ సభ్యుల వివరాలను గుర్తించలేక 'నో మ్యాపింగ్' కింద దరఖాస్తులు సమర్పించిన వారికి కూడా ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఇప్పుడు పాత ఓటర్ల జాబితాలోని వివరాలను గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేస్తే, వాటిని పోర్టల్‌లో నవీకరించే అవకాశం ఉంది. దీంతో సర్ ప్రక్రియలో మిగిలిన లోపాలను సరిదిద్దుతూ కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

# స్థానిక సంస్థల ఎన్నికల సవాల్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్ గా తీసుకున్నారు. ముందుగా మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. పట్టణ ఓటర్లు కొంత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని ఓట్లు వేస్తారని చంద్రబాబు నమ్మకం కావచ్చు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలు తర్వాత జరపాలని చంద్రబాబు ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణ ప్రాంత ఓటర్లయితే రాష్ట్రంలో జరిగే అభివృద్ధితో పాటు తన పాలనకు, గత పాలనకు బేరీజు వేసుకుని ఓటు వేస్తారని ఆయన నమ్మకంగా ఉన్నట్లుంది. అందుకే తొలుత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించారు. అయితే మున్సిపల్ ఎన్నికలలోనూ కూటమితో కలసి పోటీ చేస్తుండటంతో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు నిన్న సాయంత్రం జనసేన, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఇబ్బందులు, అపోహలు లేకుండా చూసుకునేందుకు జిల్లాలు, నియోజకకవర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుంటే బాగుంటుందని సూచించారు. ఏ పార్టీకి ఆ పార్టీ సమావేశాలు పెట్టుకుని తమకు బలం ఉన్న ప్రాంతంలో పోటీ చేసే విధంగా క్యాడర్ ను సమాయత్తం చేయాలని చెప్పినట్లు తెలిసింది. దీంతో పాటు ఇక రాష్ట్ర స్థాయిలో కూడా కూటమి సమన్వయ కమిటీ సమావేశాలు తరచూ జరిగేలా ఒక క్యాలెండర్ ను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. . దీనివల్ల మిత్ర పక్షాల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా ఎన్నికలకు వెళ్లవచ్చని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. జాఎఖీ ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఇదే విషయాన్ని కూటమి సమావేశంలో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం గత రెండేళ్లుగా చేసిన మంచి పనులను ప్రజలకు వివరించేలా మూడు పార్టీలు కలసి అన్ని ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేసుకుని ప్రజలను చైతన్య వంతుల్ని చేయాలని నిర్ణయించారు. ఇక సీట్ల సర్దుబాటు విషయంలో స్థానిక ఎమ్మెల్యేలతో పాటు అక్కడి నేతల అభిప్రాయాలను కూడా తీసుకుని తర్వాత చేసుకుంటే కొంత సత్ఫలితాలనిస్తుందన్న అంచనాలో చంద్రబాబు ఉన్నారు. మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేస్తే ఇక తమకు మిగిలిన ఎన్నికల్లో తిరుగుండదని భావిస్తున్నారు.




### అధికారులపై గుస్సా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కాలంలో అధికారుల పనితీరు, పాలనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెట్టాలని, అధికారుల పనితీరు మారాలని ఆయన స్పష్టం చేశారు.పరిపాలనలో గతంలో జరిగిన తప్పులను పునరావృతం చేయవద్దని, విధులు సక్రమంగా నిర్వర్తించాలని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించేది లేదంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా, తప్పుడు ప్రచారాలు, వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. కులాలు, మతాల పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అయినా కొందరు అధికారులు కొంత ప్రభుత్వానికి నెగిటివ్ గా పనిచేస్తున్నారని చంద్రబాబుకు అవగతమయింది. కొందరు కీలక స్థానంలో ఉన్న అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ఇటువంటి వారిని గుర్తించి జాగ్రత్తగా లేకపోతే భారీ నష్టం తప్పదని మంత్రులను హెచ్చరించారు. ఇటువంటి వారిని గుర్తించి అవసరమైతే వారిని ఆ యా స్థానాల నుంచి తప్పించాలని కూడా మంత్రులకు ఆదేశించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఈ విషయం అర్థమయినట్లుంది. గత కొంతకాలంగా ప్రత్యర్థి పార్టీలకు ప్రభుత్వ సమాచారం అందుతుండటంతో పాటు అన్ని రకాల డాక్యుమెంట్లు కూడా వెళుతుండటాన్ని చంద్రబాబు గమనించారు. వాటిని పట్టుకుని వైసీపీ నేతలు తమను విమర్శిస్తున్నారని, అయితే ఇటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చగా మారింది. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అధికారులను తన నియంత్రణలో ఉంచుకుంటారు. కానీ ఈసారి మాత్రం అలా జరగడం లేదు. అధికారులు సమావేశాల్లో మాత్రం చెప్పినట్లే విన్నట్లు తలూపుతున్నారు. కానీ బయటకు వెళ్లిన తర్వాత మాత్రం తమ పని తాము చేసుకుని వెళుతున్నారు. మరొకవైపు ఇటు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి రావడం, పనుల వత్తిడితో పాటు వరస పర్యటనలతో తమకు సమయమే సరిపోవడం లేదన్నది అధికారుల వాదన. అలాగే నిత్యం సమీక్షల పేరుతో ఇలా ఇబ్బంది పెడితే తమ విధి నిర్వహణ చేయడం కూడా కష్టమని కొందరు అధికారుల వాదన. అయితే చంద్రబాబు తాజాగా చేసిన వ్యాఖ్యలు మాత్రం అధికారులకు వార్నింగ్ లుగానే చూడాలి. కానీ వారే పాలనలో ముఖ్యులు. అలాంటి వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఇంకా నష్టం చేస్తారన్న భయం టీడీపీ నేతల్లో నెలకొంది.

# 9 రూపాయిలకు చేరిన కోడిగుడ్డు ధర

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్‌లో కోడి గుడ్డు ధర సామాన్యుడిపై గుదిబండలా మారింది. కోళ్ల ఫారాల వద్దే ఒక్కో కోడి గుడ్డు రూ. 6.95 పైసలతో రికార్డు స్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఫారాల వద్ద రూ. 6.95 పైసలు ఉన్న కోడి గుడ్డు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైగానే పలుకుతుంది. గతేడాది ఇదే రోజున రూ. 4.90 పైసలు ఉండగా ఇప్పుడు డబుల్ అయింది. నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా కోడిగుడ్డు ధర కూడా ఆకాశాన్ని తాకింది. మిడిల్ క్లాస్ ఇళ్లల్లో నాన్ వెజ్‌కి ప్రత్యామ్నాయంగా ఉన్న గుడ్డు ధర చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. కోళ్ల ఫారాల దగ్గరే రికార్డు స్థాయికి ధర చేరగా.. ఇక బయట మార్కెట్లలో ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సడెన్‌గా పెరిగిన ఈ కోడి గుడ్డు రేటుతో సామాన్యుడు సతమతమవుతున్నాడు.తూర్పుగోదావరి జిల్లాలో కోళ్ల ఫారాలు చాలా ఎక్కువ. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఇక్కడి గుడ్లే ఎగుమతి అవుతుంటాయి. అలాంటి తూర్పు గోదావరి జిల్లాలో కోళ్ల ఫారం వద్దే గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉంది. ఇప్పటి వరకు కోడి గుడ్డు ధర అత్యధికంగా ఉన్న రేటు కూడా ఇదే కావడం విశేషం.తూర్పు గోదావరి జిల్లాలో సాధారణంగా 1.3 కోట్లకు పైగా కోళ్లు ఉండగా రోజుకు కోటి వరకు గుడ్లు ఉత్పత్తి అవుతుండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల కోళ్లు కూడా చాలా ఎక్కువగానే మృతిచెందాయి. అధికారికంగా ఈ సంఖ్యం 16.35 లక్షలు ఉండగా, అనధికారికంగా 20 లక్షలకు పైగా కోళ్లే మృతి చెందాయని రైతులు చెబుతున్నారు. దాంతో పాటు బతికిన కోళ్లు కూడా పూర్తి స్థాయిలో గుడ్లు పెట్టకపోవడంతో గుడ్ల కొరత ఏర్పడింది.ప్రస్తుతం కోళ్ల ఫారాల వద్ద గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉండగా, అదే బహిరంగ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైనే విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే రోజు రూ. 4.94 పైసలు ఉండగా ఇప్పుడు ఆ ధర రెట్టింపయింది. దీంతో పాటు కిలో చికెన్ ధర కూడా రూ. 300కు పైమాటే. దాణా ధరలు విపరీతంగా పెరగడంతోనే ఈ ధరలు పెరిగాయని రైతులు అంటున్నారు. సోయా ధర టన్ను రూ. 40 వేల నుంచి రూ. 65 వేలకు, నూనె తీసిన తౌడు ధర రూ. 12 వేల నుంచి రూ. 22 వేలకు మొక్కజొన్న ధర కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు.



## అర్హులందరికీ రుణాలు

-మొదటిపేజీ తరువాయి

ఆయుధమిస్తున్నాం. పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. ఏ అభివృద్ధి కార్యక్రమం తెచ్చినా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు ఇలా అర్హులైన అందరికీ రుణం అందించడమే లక్ష్యం. ప్రజల వద్దకే బ్యాంకులు వెళ్లి రుణాలు అందించడం గర్వకారణం. ఈ ఏడాది 5 లక్షల మందితో ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేలా చర్యలు.
బ్యాంకింగ్‌లో నిర్మలా సీతారామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం తీసుకొచ్చారు. జనధన్ యోజన ద్వారా కోట్లాదిమందికి బ్యాంకు ఖాతాలిచ్చారు. జీఎస్టీ శ్లాబ్‌లు ఎక్కువ ఉండేవి చాలామంది నష్టపోయారు. రైతులు, పేదలకు న్యాయం జరిగేలా జీఎస్టీ శ్లాబులు మార్చారు. క్రియేటివ్‌గా ఆలోచించే సమర్థ మంత్రిగా నిర్మలను చూశాం. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు నిర్మల తీసుకొచ్చారు.
రాబోయే రోజుల్లో 6 జిల్లాల్లో సమావేశాలు పెడదామంటే నిర్మల అంగీకరించారు. త్వరలోనే 3 నెలల ఒకటి, క్రెడిట్ అవుట్‌రీచ్ వంటి కార్యక్రమాలు. ఈ సమావేశాలకు నిర్మలా సీతారామన్ వస్తారని ఆమెను కోరుతున్నా. రెండేళ్లకు మునుపు రాష్ట్రంలో అంతా చీకటి, విధ్వంసం. ఎప్పుడూ చూడని ఆర్థిక సంక్షోభాన్ని చూశాం. ఎక్కడ చూసినా సమస్యల సుడిగుండమే. రాష్ట్రాన్ని మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పాం. మళ్లీ బయటపడ్డామంటే కేంద్ర సహకారమే" అని సీఎం చంద్రబాబు తెలిపారు.
"2027 మార్చిలోపు పోలవరం పూర్తిచేసి మొదటి ఫేజ్‌ను జాతికి అంకితం చేస్తాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. ప్రపంచానికి గ్లోబల్ హబ్‌గా రాయలసీమ హార్టికల్చర్ తయారవుతుంది. యుద్ధాలు జరుగుతున్నాయి, మరోవైపు వాతావరణ పరిస్థితులు తారుమారయ్యాయి. వర్షాలు కురవట్లేదు, పడినా కుంభవృష్టి, అనావృష్టితో బాధపడుతున్నాం. వర్షాల తక్కువై గోదావరికి నీళ్లు రావడం కూడా తగ్గిపోయే పరిస్థితి. దేశానికి ప్రధాని మోదీ, సమర్థ నాయకుడు. ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు నరేంద్రమోదీ." - సీఎం చంద్రబాబు

## ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలి

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. ప్రతి జిల్లా కలెక్టర్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, అధిక ప్రమాద మండలాలు, రైతు సేవా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జూన్ 1 నుంచి జులై 15 వరకు సాధారణంతో పోలిస్తే 48.3 శాతం వర్షపాతం లోటు నమోదైందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ వివరించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 24 జిల్లాలు లోటు వర్షపాతం, నాలుగు జిల్లాలు తీవ్ర లోటు వర్షపాతం కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 1,357 అధిక ప్రమాదం ఎదుర్కొంటున్నవిగా ఉన్నాయని, రాయలసీమ జిల్లాలోనే ఇవి అత్యధికంగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించాలని, రైతు సేవా కేంద్రాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా నిరంతర పంట సలహాలు అందించాలని సీఎస్ ఆదేశించారు.

### ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్మాయ పంటలు

ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు, అత్యవసర పరిస్థితులకు అవసరమైన విత్తనాలను ముందుగానే జిల్లాల్లో అందుబాటులో ఉంచాలని సీఎస్ జి. సాయిప్రసాద్ సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుకూలమైన ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (ాపీఋా), ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, తక్కువ నీటితో సాగు చేసే పంటలను మరింత విస్తరించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు ప్రతిరోజూ పరిస్థితులను పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సూచనలు అందించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ముఖ్యంగా మిర్చి, ఉల్లి, కూరగాయలు, మామిడి, నారింజ, నిమ్మ వంటి ఉద్యాన పంటలకు అధిక ప్రమాదం ఉందని ఉద్యానవన శాఖ కమీషనర్ శ్రీనివాసులు వివరించారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ఉద్యాన పంటలకు జీవనాధార నీటిపారుదల ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.

### రైతులకు కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు

వర్షాభావ పరిస్థితుల్లో పశుగ్రాసం, తాగునీటి లభ్యత అత్యంత కీలకమని సీఎస్ వివరించారు. ఆక్వా, మత్స్యరంగంపై ఎల్‌నినో ప్రభావాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అత్యవసర సమయంలో వెంటనే స్పందించే విధంగా జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల తదితర శాఖలు సమిష్టిగా పనిచేస్తే రైతులకు కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని సీఎస్ అధికారులకు వివరించారు.

## భారతదేశ అభివృద్ధిలో రైల్వే శాఖది కీలక పాత్ర

-మొదటిపేజీ తరువాయి

హంగులతో గుంటూరు జిల్లా మంగళగిరి రైల్వేస్టేషన్‌ను పునర్వ్యవస్థీకరించారు. రూ.12.56 కోట్ల భారీ వ్యయంతో ఆధునికీకరణ చేశారు. నేడు (శుక్రవారం) ఈ స్టేషన్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశ అభివృద్ధిలో రైల్వే శాఖది కీలక పాత్ర అని మంత్రి లోకేశ్ తెలిపారు. మోదీ ముందు చూపుతో రైల్వే అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల కింద ఆధునీకరించిన మంగళగిరి రైల్వే స్టేషన్ గడచిన 2 ఏళ్లలో చేసిన అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు తొలి అడుగు మాత్రమేనన్నారు. రాష్ట్ర ఆదాయం రూపాయి ఉంటే ఖర్చు రూ.1.40 ఉంటోందని తెలిపారు. ఆర్థిక లోటు వేధిస్తున్నా అభివృద్ధి-సంక్షేమం జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. పెట్టుబడులు సాధన ద్వారా మన రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించడంతో పాటు పొరుగు రాష్ట్రాల యువత మన రాష్ట్రం వైపు చూసేలా చేస్తామని లోకేశ్ వెల్లడించారు.
"గతంలో రైళ్లు ఆలస్యం అయ్యేవి. రైళ్లు, స్టేషన్లు శుభ్రంగా ఉండేవి కావు. మోదీ నాయకత్వంలో వందేభారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ సాంకేతికత. ప్రధాని మోదీ నేతృత్వంలో వందశాతం ఎలక్ట్రిఫికేషన్, రైల్వే విప్లవం వచ్చింది. దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వే అభివృద్ధి జరగాలి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా హైడ్రోజన్ రైలు రీసర్చ్ జరుగుతోంది. వేలాది కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మంగళగిరిలో రైళ్లు ఎక్కువగా ఆగేలా చూడాలి. రైల్వేస్టేషన్ ఎకనమిక్ యాక్టివిటీగా మారాలి. అమరావతికి ఎయిర్, రోడ్, రైల్ కనెక్టివిటీ కీలకం. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్ ఏర్పాటు దిశగా చర్యలు. సీఎం, డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో వేగంగా అమరావతి పనులు. అమరావతిని గ్లోబల్ సిటీగా తయారు చేయడం లక్ష్యం."

### సెల్ఫీ పాపది, సర్‌ప్రైజ్ లోకేశ్‌ది


మంగళగిరి రైల్వేస్టేషన్ ప్రోగ్రామ్‌లో డ్యాన్స్ పర్ఫార్మెన్స్ కోసం రెడీ అయిన ఓ చిన్నారి, ముచ్చటగా సెల్ఫీ తీసుకుందామని ఫోన్ పైకెత్తింది. అంతే బ్యాక్‌గ్రౌండ్‌లోకి సైలెంట్‌గా అనుకోని అతిథిలా ఎంట్రీ ఇచ్చారు ఐటీ మంత్రి నారా లోకేశ్. ?ఆ పాప క్యూట్ కుతూహలాన్ని చూసి ముచ్చటపడ్డ లోకేశ్, తానే స్వయంగా వెళ్లి ఆమె కెమెరా ఫ్రేమ్‌లో నిలబడ్డారు. ఫోన్ స్క్రీన్ వైపు చూసి ఒక్కసారిగా షాకైన ఆ చిన్నారి, పక్కన ఉన్నది మంత్రి లోకేశ్ అని తెలిసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోయింది.

## గోదావరి జిల్లాలపై నేతల గురి

**రాజమండ్రి :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గోదావరి ప్రాంతానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు ) జిల్లాల్లో రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం కొత్త విషయం కాదు. ఈ ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండటంతో పాటు ఎన్నికల సమయంలో ప్రజల తీర్పు కూడా రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తుంటారు. అందుకే అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ గోదావరి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటాయి.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుస జిల్లా పర్యటనలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాయలసీమ ప్రాంతంలోని తిరుపతి చిత్తూరు , కడప, అన్నమయ్య జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఇప్పుడు గోదావరి జిల్లాల పర్యటన ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించడంపై దృష్టి పెట్టారు.ఈ పర్యటనలో భాగంగా తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు.

# ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఎంజీ ఆర్.

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు గారిని అమరావతి సచివాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ నియోజకవర్గ ప్రజలకు అత్యంత అవసరమైన పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, నిర్వాసితుల సమస్యలు, విద్య, రహదారులు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రధానంగా కోరిన అంశాలు.వంశధార నిర్వాసితుల సమస్యలు: వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల కేసులను త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని, ఇల్లు కోల్పోయిన కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. వంశధార నదిపై కొత్త వంతెనలు భగీరథపురం -- హిరమండలం మధ్య నూతన బ్రిడ్జి. కల్లట–జిల్లోడుపేట మధ్య బ్రిడ్జి. పాతపట్నం మండలం గోపాలపురం వద్ద బ్రిడ్జి.. బూరగాం వద్ద బ్రిడ్జి.ఏఎస్ కవిటి వద్ద గుమ్మగడ్డపై కాజ్‌వే బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో యువతకు సాంకేతిక విద్య అందించేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు కొత్తూరు మండలం లో గల నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.డబుల్ రోడ్ల నిర్మాణం కిమిడి కళింగ పర్లాకిమిడి రహదారి నుంచి సిది, రుగడ మీదుగా కొత్తూరు మండలం మాతల వరకు డబుల్ రోడ్డు,పాతపట్నం తెంబూరు వరకు డబుల్ రోడ్డు,పాతపట్నం మెలియాపుట్టి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలపాలని కోరారు పాతపట్నం నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రివర్యులు సానుకూలంగా స్పందించారు అలాగే ఎమ్మెల్యే గారు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.



## పిఠాపురం పాడా కార్యాలయంలో 'వన్ మంత్ వన్ విలేజ్' కార్యక్రమం

### : గొల్లప్రోలు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)**పిఠాపురంలోని పాడా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరీంద్ర ప్రసాద్ గొల్లప్రోలు పట్టణ యువకులు, ప్రముఖులు కలిసి ఒక వినతిపత్రాన్ని అందజేశారు.

**పట్టణంలో లేని పార్కులు, క్రీడా మైదానాలు**

గొల్లప్రోలు పురపాలక సంఘం దాదాపు 30 వేలకు పైగా జనాభా నివసిస్తున్నప్పటికీ, పట్టణంలో కనీసం ఒక్క పార్కు కానీ, క్రీడా మైదానం కానీ లేకపోవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కనీస వినోద, శారీరక ఉల్లాస వేదికలు లేకపోవడం వల్ల స్థానిక యువత తప్పుదోవ పట్టే ప్రమాదం ఉందని, అలాగే చిన్నారులు పార్కులు లేక నిరంతరం సెల్ ఫోన్‌లకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ,ప్రతి 5 వార్డులను ఒక యూనిట్‌గా తీసుకుని ఒక పార్కును ఏర్పాటు చేయాలని,గొల్లప్రోలు పట్టణ పరిధిలో యువత కోసం రెండు పెద్ద క్రీడా మైదానాలను నిర్మించాలనీ పట్టణ యువతకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించి, వారు క్రీడల వైపు ఆసక్తి చూపేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పట్టణంలో తక్షణమే మైదానాలు, పార్కులు ఏర్పాటు చేస్తే యువత శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పొందుతారని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు పరిధికి చెందిన , పర్వత సురేష్, కుర్రు అశోక్, గుండ్ర శ్రీను, పర్ల శ్రీను తదితరులు పాల్గొని కలెక్టర్‌కు సమస్యలను వివరించారు.

# వార్డెన్ సస్పెన్షన్‌పై వైసీపీని లక్ష్యంగా చేసుకోవడం తగదు

**కూటమి నాయకుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టిన మండల వైసీపీ నేతలు**

**అధికారుల విచారణ ఆధారంగానే సస్పెన్షన్ జరిగిందని స్పష్టీకరణ**

**రహదారి పనులపై చేస్తున్న ఆరోపణలు కూడా అవాస్తవమేనని వ్యాఖ్య**

**తప్పుడు ప్రచారం కొనసాగితే తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరిక**



**ఎటపాక, జూలై 17 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గౌరీదేవిపేట ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ సస్పెన్షన్ వ్యవహారాన్ని రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేయడం తగదని ఎటపాక మండల వైసీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం గౌరీదేవిపేటలోని మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు ఈ మేరకు మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కూటమి నాయకులకు సూచించారు.

**కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారుల విచారణతోనే చర్యలు**

వసతి గృహంలో విద్యార్థులతో సిమెంట్ పనులు చేయించడం, రాళ్లు మోయించడం వంటి ఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా యంత్రాంగం స్పందించిందని నాయకులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం వార్డెన్‌ను సస్పెండ్ చేశారని వివరించారు.

**రాజకీయ రంగు పులమడం సరికాదు**

ఈ వ్యవహారానికి స్థానిక వైసీపీ నాయకులే కారణమంటూ కూటమి నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని మండల వైసీపీ నేతలు కొట్టిపారేశారు. అధికార యంత్రాంగం తీసుకున్న పరిపాలనా చర్యను రాజకీయ కుట్రగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ వ్యవహారంలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదని స్పష్టం చేశారు.

**రహదారి పనులపై ఆరోపణలు అవాస్తవం**

గౌరీదేవిపేట--మాధవరావుపేట రహదారి నిర్మాణానికి వైసీపీ అడ్డంకులు సృష్టిస్తోందంటూ కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారం కూడా వాస్తవానికి విరుద్ధమని అన్నారు. నాణ్యతతో కూడిన రహదారి నిర్మాణాన్ని తాము ఎప్పటికీ సమర్థిస్తామని, అభివృద్ధి పనులకు వైసీపీ ఎలాంటి ఆటంకం కలిగించదని స్పష్టం చేశారు.

**ప్రచారం ఆపకపోతే స్పందిస్తాం**

రాజకీయ లబ్ధి కోసం వైసీపీపై నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలు కొనసాగిస్తే తగిన విధంగా ప్రజాస్వామ్యబద్ధంగా స్పందిస్తామని మండల నాయకులు హెచ్చరించారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

**సమావేశంలో పాల్గొన్న నాయకులు**

ఈ పాత్రికేయుల సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు, రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, యువజన విభాగం అధ్యక్షుడు తోట శశికుమార్, మండల ఉపాధ్యక్షుడు శీలం నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల దయాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చిచ్చడి రామారావుతో పాటు కాకాని సురేష్, ముత్తిబోయిన రాము, చల్ల మణి, కాటం స్వరూప్, ధారా రమేష్, ధారా రవి, జంగాల సాయిబాబా, వంశీ, పులుసు రాము, వెల్లంకి కొండబాబు, కోడూరి నవీన్, కొప్పుల వెంకటేశ్వరరావు, ఎలమోలు రమేష్, గుండె కోటేశ్వరరావు, తెల్లం నవీన్ బాబు, కురసం రాజశేఖర్, ఇరప మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అకాల మరణం పట్ల జనసేన నేతల సంతాపం: రాజమండ్రిలో కుమార్తె క్రాంతి పరామర్శ



**రాజమండ్రి (ప్రజా జ్యోతి)** సామాజిక ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అకాల మరణం పట్ల పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సంతాపాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజమండ్రిలో ఉన్న ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి పిఠాపురం జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి పరామర్శించారు. ఈ కష్టసమయంలో ఆమెకు, వారి కుటుంబ సభ్యులకు జనసేన శ్రేణులు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాశ్, పిఠాపురం మండలం జనసేన పార్టీ ఇంచార్జ్ వెన్నా జగదీష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ల పాల్గొన్నారు. అలాగే అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తోలేటి శిరీష, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గంజి గోవిందరాజు, కందరాడ జనసేన ఎంపీటీసీ పిల్లా దినేష్, జనసేన పార్టీ నాయకులు అడపా శివరామకృష్ణ, వార్డ్ ఇంచార్జ్ కృష్ణలతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, జనసేన వీర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం మరణం తీరని లోటని పేర్కొన్నారు. దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఘనంగా వద్దిబోయిన సాయి కిరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ నేతలు**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 17 (ప్రజా జ్యోతి)** తెలుగుదేశం పార్టీ నాయకులు ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి కుమారుడు వి.బి.పి.ఆర్ కన్స్ట్రక్షన్స్ ఎం.డి వద్దిబోయిన సాయి కిరణ్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం బద్వేల్ పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు.అన్నా క్యాంటీన్ లో మూడు పూటలా భోజనం ఏర్పాటు చేశారు.ఆర్టీసీ బస్టాండ్ ఆవరణము నందు ఆనాధలకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో టిడిపి మున్సిపాలిటీ అధ్యక్షులు వెంగళరెడ్డి , మునిపాలిటీ కార్యదర్శి మిత్తికాయల రమణ,గోపవరం యం.పి.పి కొండయ్య, అడ్వకేట్ శ్రీధర్,గోపవరం మండలం టిడిపి కోశాధికారి దేరంగుల విజయ్,నాయకులు కృష్ణారెడ్డి, ప్రశాంత్,కొమ్మురాజు శ్రీనివాసులు, బైసాని రవీంద్రారెడ్డి ,బైసాని మదన్ రెడ్డి, బిజివేముల రాజశేఖర్ రెడ్డి, షేక్ అలంగీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నాను

ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి.



**పాలకొల్లు / పోడూరు.ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. జూలై 18.** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి తెలిపారు. శుక్రవారం పోడూరు మండలంలో పర్యటించిన ఎమ్మెల్సీ గోపీమూర్తి మండలంలోని 11 పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తన 19 నెలల ఈ పదవీ కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిత్యం పై అధికారులకు, ప్రభుత్వానికి వివిధ మెమోరాండం లు సమర్పించానని, కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ముఖ్యంగా 2009 విద్యాహక్కు చట్టం లో ఉన్న సెక్షన్ 23 (1) ని పార్లమెంట్ చట్ట సవరణ చేసి 2010 కి ముందు ఉపాధ్యాయ నియామకాలు పొందిన వారికి టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్ గ్రేడడ్ హైస్కూల్స్ లో నైట్ వాచ్ మ్యాన్ లను నియమించాల్ని, ఉపాధ్యాయులకు 12 పి ఆర్సీ నియామకం, ఐ ఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆయన పర్యటన లో యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి యస్ విజయరామ రాజు, జిల్లా కార్యదర్శి యం వి రాజశేఖర్,జిల్లా ఆడిట్ సభ్యులు డీవీ నర్సింహారావు,మండల అధ్యక్షులు కె నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి కె పెద్దిరాజు పి శ్రీనివాస్ గెద్దాడ పెద్దిరాజు కె నాగేశ్వరరావు, ఆర్ సంతోష్, జి గణపతి రావు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముద్దాయికి జైలు



**నంద్యాల(కోవెలకుంట్ల) ప్రజాజ్యోతి :జులై=17** 17/7/2026వ తారీఖున కోవెలకుంట్ల సిఐ పి హనుమంతనాయక్ ఈనెల అనగా జూలై నెల 07 తారీఖున రాత్రి 11 గంటలకు కోయిలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలో బీసీ కాలనీలో నివాసముంటున్న మేకల వసుంధరరావు కొడుకు వంశీకృష్ణను మానసిక పరిస్థితి సరిగా లేదని అతనిని ఆరోగ్యం చూపించకుండా నిర్లక్ష్యం చేస్తూ హత్య చేసిన దానిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టడం జరిగింది. ఈరోజు మేకల వంశీకృష్ణ 22 సంవత్సరాలు హత్య చేసిన కేసులో అతని తండ్రిని ఈ కేసులో ముద్దాయిగా నిర్ధారించి సదరు నిందితుడు మేకల వసుందరావు ను అరెస్టు చేయడం జరిగింది. ఈరోజు కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించడం జరుగుతుంది

## 1.కోటి 20.లక్షల రోడ్డులో ప్రయాణం ప్రాణ సంకటం.

**ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం.6.కిలోమీటర్ల దూరం నరకప్రాయం.**

**ప్రభుత్వం బీటీ రోడ్డు మంజూరు చేయలని గిరిజన ప్రజాలు డిమాండ్.**



**అనంతగిరి మండలం జూలై 17. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం.కీవర్ల పంచాయితీ బొంగిజా రోడ్డుకు ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో కోటి 20.లక్షలు మంజూరు చేసి రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టి 8.కల్వర్టులతోపాటు కొంతమేర పూర్తి చేయగా మిగిలిన ఆరు కల్వర్టుల పనులు చేయవలసిన మెటీరియల్ ఇసుక.కంకర.సిమెంటు తోలకం సమయంలో ఇటీవల కాలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ నేపథ్యంలో పనులు అర్ధాంతరంగా ఆగిపోయి పూర్తిగా మట్టి కొట్టుకుపోవడంతో ఈ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులకు అరచేతిల్లో ప్రాణం పెట్టుకుని ప్రయాణించే ప్రయాణం ప్రణ సంకటంగా మారిందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పంటల భీమా ప్రిమియర్ ప్రభుత్వమే చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంగం డిమాండ్ (ఎఐకేయస్)



**నంద్యాల బనగానపల్లె ప్రజాజ్యోతి :జులై=17** శుక్రవారంబనగానపల్లె సిపిఐ కార్యాలయం ఆవరణలో రైతు సంఘం సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారెడ్డి జి.సోమన్న మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావం తో వర్షాలు తక్కువగా పడడం తో రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారు అన్నారు రైతులతో పంటల భీమా నగదు చెల్లించాలని చెప్పడం సరికాదని వారు అన్నారు గత ప్రభుత్వము లో కరోనా సమయం లోను ప్రభుత్వమే బీమా చెల్లించిందని గుర్తు చేశారు రైతులకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రైతులపై భారం మోపడం తగదని పుట్టెడు కష్టాలతో ఉన్న రైతన్నకు ప్రభుత్వం అండగా ఉండాలని బీమా ప్రీమియర్ ప్రభుత్వమే చెల్లించి రైతన్న ను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ పరిస్థితి లో అగ్రికల్చర్ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిశీచాలని వారన్నారు సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య..మండల సమితి సభ్యులు శివ నాగయ్య. రైతు మద్దిలేటి పాల్గొన్నారు..

## వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు సూచన..ఎమ్మెల్యే శిరీషదేవి చొరవతో ఫలితం

సీఎం రిలీఫ్ ఫండ్‌తో వెరికోస్ వెయిన్స్ బాధితుడికి కొత్త జీవితం

రూ.2.74 లక్షల వైద్యసాయంతో విజయవంతమైన శస్త్రచికిత్స

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు



**ఎటపాక, జూలై 17 (ప్రజాజ్యోతి):** పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తోందని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు తెలిపారు.

**మూడేళ్లుగా వ్యాధితో తీవ్ర ఇబ్బందులు**

పోలవరం జిల్లా ఎటపాక మండలం గౌరీదేవిపేట గ్రామానికి చెందిన బుడిపిటి కృష్ణార్జున రావు గత మూడు సంవత్సరాలుగా వెరికోస్ వెయిన్స్ (కాళ్లలో ఉబ్బిన, మెలితిరిగిన సిరలు) వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్నారు. వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావును ఆశ్రయించారు.

**ఎమ్మెల్యే చొరవతో మంజూరైన వైద్యసాయం**

వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు బాధితుడి పరిస్థితిని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె ప్రత్యేక చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షల 74 వేల వైద్యసాయం మంజూరైంది. దీంతో విజయవాడలోని అభయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో బాధితుడికి రెండు కాళ్లకు వెరికోస్ వెయిన్స్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు.

**కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

సకాలంలో ఆర్థిక సహాయం అందించి వైద్యం చేయించేందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్, ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావుకు బాధితుడు బుడిపిటి కృష్ణార్జున రావు, ఆయన కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మడకం నరసింహారావు, ముక్కెర భద్రరావు, మల్లెల లక్ష్మణరావు, గవ్వల పద్మ, జింక సోమమ్మ, బుడిపిటి వాణి, పల్లంటి అరుణ, బుడిపిటి నవ్య, సూదిపాక జయమ్మ, మార్త చంటి, కంగాల మంగ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, టీడీపీ నేతలు



**హోళగుంద, జూలై 17, ప్రజా జ్యోతి న్యూస్ –** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆస్పరి మండల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం ఆస్పరిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభా స్థలాన్ని జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు గురువారం విస్తృతంగా పరిశీలించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, జిల్లా కలెక్టర్ సిరి, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. వారితో పాటు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఎస్పీ వెంకట్రామయ్య, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు ఈ స్థల పరిశీలన చేశారు. సీఎం పర్యటన దృష్ట్యా సభా ప్రాంగణం వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై డీఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు.సభకు తరలివచ్చే ప్రజలకు, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వాహనాల పార్కింగ్, ఎండ తీవ్రతను తట్టుకునేలా చలువ పందిళ్ళు వంటి కనీస వసతుల కల్పనపై జాయింట్ కలెక్టర్, మండల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత విజయవంతం చేయాలని వైకుంఠం జ్యోతి మరియు గుడిసె కృష్ణమ్మ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికారులు, అటు భద్రత ఇటు ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# పిఠాపురం మార్కెట్ సెంటర్‌లో సందడి: ఆటో డ్రైవర్లు, కార్యకర్తలతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎస్వీఎస్ఎన్ వర్మ!



**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి)** రాజకీయాల్లో నాయకుడు ప్రజల మనిషిగా మెలిగినప్పుడే ఆ బంధం మరింత బలపడుతుంది. శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో సరిగ్గా ఇదే దృశ్యం ఆవిష్కృతమైంది. పిఠాపురం మార్కెట్ సెంటర్‌లోని ప్రముఖ 'అక్కమ్మ టీ స్టాల్' వద్ద పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎంఎల్ఏ , సీనియర్ నేత వర్మ సందడి చేశారు.సాధారణ ప్రజలతో మమేకం కావడంలో ఎప్పుడూ ముందుండే వర్మ, శుక్రవారం మార్కెట్ సెంటర్‌కు చేరుకోగానే కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కమ్మ టీ స్టాల్ వద్ద అందరితో కలిసి కూర్చుని ఆప్యాయంగా చాయ్ తాగారు. నాయకుడు తమ పక్కనే కూర్చుని టీ తాగుతూ ముచ్చటించడంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వ్యక్తమైంది.

**ఆటో డ్రైవర్‌తో సరదా ముచ్చట్లు**

టీ తాగుతున్న సమయంలో అక్కడే ఉన్న స్థానిక ఆటో డ్రైవర్‌ను వర్మ పిలిచి పలకరించారు. అత్యంత సాధారణంగా, ఒక ఆత్మీయుడిలా ఆటో డ్రైవర్‌తో సరదాగా మాట్లాడారు. రోజువారీ సంపాదన ఎలా ఉంది? కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఏంటి? అంటూ ఆరా తీశారు. వర్మ చూపిన ఆప్యాయతకు, ఆయన మాట్లాడిన సరదా మాటలకు ఆటో డ్రైవర్ ఆనందం వ్యక్తం చేశాడు. పెద్ద నాయకుడైనా ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా తమతో ఇంత సాదాసీదాగా కలిసిపోవడం వర్మ ప్రత్యేకత అని అక్కడి స్థానికులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో వర్మతో పాటు పార్టీ స్థానిక ప్రముఖ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రత్తి, వరి రైతులకు అలర్ట్

పంటల భీమాను సద్వినియోగం చేసుకోండి

గొల్లప్రోలు మండల వ్యవసాయ అధికారుల పిలుపు.ఈ నెల 24 లోగా ప్రత్తి,

ఆగస్టు 15 లోగా వరి పంటలకు ప్రీమియం చెల్లించాలి

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** రైతుల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన ఖరీఫ్ 2026 పంటల భీమాను గొల్లప్రోలు మండల రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, మండల వ్యవసాయ అధికారి కె.వి.వి. సత్యనారాయణ కోరారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో వారు మాట్లాడారు.ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు.

**ప్రత్తి పంట భీమా వివరాలు**

గొల్లప్రోలు మండలంలో ప్రత్తి సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాది ప్రత్యేక వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ కల్పించింది. ప్రత్తి పంటకు ప్రతి రైతు రూ. 2,000/- ప్రీమియం చెల్లించాలి.

**ఆఖరి తేదీ:** ప్రత్తి పంట భీమా చెల్లించడానికి ఈ నెల 24 (24-07-2026) ఆఖరి తేదీ. ఇప్పటికే పంట వేసిన వారితో పాటు, రాబోయే రోజుల్లో వేయబోయే రైతులు కూడా ఈ భీమాను కట్టుకోవచ్చు.

**వరి పంట భీమా వివరాలు:**



వరి పంట వేసే రైతులు భీమా ప్రీమియం కింద రూ. 760/- చెల్లించాల్సి ఉంటుంది.

**ఆఖరి తేదీ:**

వరి పంట భీమాను ఆగస్టు 15, 2026 లోపల సంబంధిత బ్యాంకుల్లో కానీ, కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా కానీ లేదా మీసేవ కేంద్రాలలో కానీ చెల్లించవచ్చు.వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే భీమా ద్వారానే రైతులకు ఆర్థిక రక్షణ లభిస్తుందని, కాబట్టి గడువు ముగిసేలోపు రైతులందరూ నమోదు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గొల్లప్రోలు మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల (ఆర్ ఎస్ కె) సిబ్బంది, స్థానిక వ్యవసాయ సహాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## బనగానపల్లె వెలుగు ఆఫీసులో అవినీతిమయం



**నంద్యాల బనగానపల్లె ప్రజాజ్యోతి:జులై=17** బనగానపల్లె మండలం ఎనకండ్ల గ్రామం (వెలుగు ఆఫీస్ ) అనే బుక్కీ పర్స్ చేతి వాటంతో పొదుపు మహిళల పేరుమీద శ్రీనిధి12,00000 సొమ్ముస్వహ చేసినాడు అని పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన పొదుపు మహిళలు. బనగానపల్లె వెలుగు ఆఫీసులో బుక్కీ పర్సు చేస్తున్న దందాలకి అడ్డుకట్ట వేసే పొదుపు గ్రామఐక్య సంఘం, సీసీలు, ఏపీఎం ప్రమేయం లేకుండానే జరుగుతుందా.. ఈ దండ...? పొదుపు గ్రూపు సంఘాల వారు, ఎన్నోసార్లు విలేకరులు , ప్రజా సంఘాలు.. ఏపీఎంలకు అర్జీరూపాలలో పేపర్లలో.. వాట్సాప్ గ్రూపులలో వార్తలు వస్తున్న పట్టించుకొని అధికారులు. పి జే ఆర్ సి లో బనగానపల్లి వెలుగు ఆఫీస్ లో బొక్కీ పర్సు అవినీతి పాల్పడినట్లు, కొన్ని డాక్యుమెంట్స్ , పేపర్ ప్రకటన కాఫీలు మరియు మండల సమైక్య విచారణ చేసి తొలగించిన కాఫీలు జత చేసి కలెక్టర్ చేతికి ఇవ్వడం తో కలెక్టర్ గారు సంబంధిత శాఖ అయిన పీడీ గారికి రెఫర్ చేయడం జరిగింది. దీని తర్వాత ఆర్టిఏ యాక్ట్ ఏపీఎంకు సమాచారం కొరగా నా దృష్టికి ఆటువంటి విషయము నాకురాలేదని సమాచారం ఇవ్వడం జరిగింది. జిల్లా పై అధికారులకు ఆపిల్ చేస్తే అధికారి కూడా సమాచారం ఇంతవరకు ఇవ్వలేదంటే... బుక్ కీపర్లు చేస్తున్న దందా వసూలు వారికి కూడా సంబంధం ఉన్నట్లేనా.. పీజెఆర్సిలో ఏపీఎంకు కంప్లైంట్ ఇస్తే ఆ పొదుపు గ్రూపుల ను ఎంక్వేరి ఏపీఎంలు మండల సమైక్య వారు కలిసి ఎంక్వయిరీ చేసి జరిగినట్లు నిర్ధారణ అయినందు నా అవినీతి బుక్కి పర్స్ ను తొలగిస్తే ప్రస్తుతం విధుల్లో ఉన్నఏపిఎం అవినీతిపరులను తొలగించినట్లు తీర్మానించినారు. కానీ ఇప్పుడు విధుల్లో ఉన్న ఏపీఎం బుక్కీ పర్స్ తో స్నేహభావంతో కలిసి ఉండటం ఈ అవినీతిలో గ్రామ గ్రామైక్య సంఘం కు ఏపిఎంకు మరియు సిసి లకు సంబంధం ఉన్నట్టు అనిపిస్తుంది పొదుపు గ్రూపులకు మరియు కుల సంఘాలకు, పేపర్ వారికి అర్థమవుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రాజకుమార్ గారు ఈ పొదుపు సంఘాల మహిళలకు విచారించి మహిళా సంఘాల గ్రూపులకు న్యాయం చేయాలని అవినీతి పాల్పడిన ఎంతటి వారైనా శిక్షించాలని బిజెపి కాలింగి రాముడు కోరుతున్నారు.

## ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి ఛాంపియన్ షిప్ - 2026 పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి**

**బనగానపల్లె:జులై=17 ప్రజాజ్యోతి** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. నేడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు.అనంతరం అమరావతి ఛాంపియన్ షిప్ - 2026 పోస్టర్ ను స్వయంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.. ఆగస్టు 29 - జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని రూ. 91.90 లక్షల భారీ ప్రైజ్ మనీతో జులై 15 - ఆగస్టు 26 వరకు ఈ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత



అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తను పరామర్శించిన ధర్మతేజ



**కంబదూరు జూలై 17:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలంలో ని రాళ్లనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ నాగభూషణ గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, వారి సూచనలతో శుక్రవారం రాళ్ల అనంతపురం గ్రామానికి వెళ్లి నాగభూషణను స్థానిక టీడీపీ నాయకులతో కలసి పరామర్శించిన టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ ఈ కార్యక్రమంలో నాగరాజు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 6లక్షల విలువ చేసే కంప్యూటర్ ల్యాబ్ అభివృద్ధికి విరాలంగా అందచేసిన కుసుమలత



**బనగానపల్లె:జులై=17 ప్రజాజ్యోతి** బనగానపల్లె మండలం నందివర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975 పదో తరగతి పూర్వ విద్యార్థి దివంగత ఆర్.యూ.ఎన్. కృష్ణమూర్తి గారి స్మారకార్థంగా, వారి సతీమణి శ్రీమతి కుసుమలత సుమారు రూ.6 లక్షల విలువైన 20 కంప్యూటర్ పరికరాలను కంప్యూటర్ ల్యాబ్ అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి, విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ శ్రీ ఉమా మహేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఐద్వా సభ్యత్వ నమోదు జోరు.. మహిళల ఐక్యతకు బాటలు!



**కూనవరం, జూలై 17:** ప్రజా జ్యోతి ఐద్వా మహిళా సంఘం కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బొజరాయిగూడెం, రాయగూడెం, రేగులపాడు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మహిళలను సంఘంలో చేర్చి వారి హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ధర్ముల అమ్మాజీ, పెద్దార్కూర్ ఎంపీటీసీ సభ్యురాలు, ఐద్వా మండల అధ్యక్షురాలు గూడం బుచ్చమ్మ, ఐద్వా కోశాధికారి ఎం. నాగమణి, పెద్దార్కూర్ మాజీ సర్పంచ్, ఐద్వా సభ్యురాలు బొగ్గ సమక్క, బొగ్గ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదు చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘంలో సభ్యత్వం పొందారు.

# మాదకద్రవ్యాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

## చదువుపై దృష్టి సారించి నైతిక విలువలు పెంపొందించుకోవాలి: న్యాయవాది మల్లె తులసీశ్వరమ్మ



**బనగానపల్లె, జూలై 17 : ప్రజాజ్యోతి** యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యాభ్యాసంపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని, నైతిక విలువలు పెంపొందించుకొని బాధ్యతా యుతమైన పౌరులుగా ఎదగాలని మహిళా న్యాయవాది మల్లె తులసీశ్వరమ్మ సూచించారు. బనగానపల్లె పట్టణంలోని కేజీఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం కంకర గురెడ్డి (కేజీఆర్) జూనియర్ ఇంటర్ మరియు డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ, పోక్సో (పిఒసియస్ఒ) చట్టం, మహిళలు, బాలికల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించే సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేజీఆర్ విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ కంకర రామచంద్రా రెడ్డి, ప్రిన్సిపాల్ సదాశివమూర్తి అధ్యక్షత వహించగా, అధ్యాపకులు, లెక్చరర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మహిళా న్యాయవాది మల్లె తులసీశ్వరమ్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం ఆందోళనకరంగా పెరుగుతోందని, ముఖ్యంగా యువత ఈ వ్యసనాలకు బానిసైతే వారి వ్యక్తిగత జీవితం, విద్య, కుటుంబ భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరంగా అనేక సమస్యలు తలెత్తడమే కాకుండా, నేరాలకు పాల్పడే పరిస్థితులు కూడా ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. అలాంటి అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి స్నేహితులను ఎంచుకోవడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా పోక్సో (పిఒసియస్ఒ) చట్టం గురించి వివరిస్తూ, బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచార యత్నాలు వంటి నేరాలను అరికట్టేందుకు ఈ చట్టం ఎంతో కఠినంగా అమలవుతోందని చెప్పారు. ఇటీవల ఇటువంటి కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల కూడా కొందరు యువకులు నేరాల్లో చిక్కుకుంటున్నారని, ప్రతి విద్యార్థి చట్టాల గురించి తెలుసుకుని బాధ్యతతో ప్రవర్తించాలని సూచించారు. చదువే జీవితానికి బలమైన పునాది అని, విద్యార్థులు సామాజిక మాధ్యమాలు, చెడు అలవాట్లు, అనవసర స్నేహాలకు దూరంగా ఉండి తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. బాలబాలికలు పరస్పరం గౌరవం, స్నేహభావం, క్రమశిక్షణతో మెలగాలని, మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పోక్సో వంటి కేసుల్లో నిందితులుగా తేలితే అత్యంత కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాంటి నేరాల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు నేరాల నివారణ, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె యూత్ టీం సభ్యులు చందు, శేషావలి, బాబు, శ్రవణ్, మనోజ్, అబ్దుల్, చింటూ, అమర్ బాల్ తదితరులు, కళాశాల అధ్యాపకులు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నహ్యాట గ్రామంలో తీరిన తాగునీటి కష్టాలు





### టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతికి కృతజ్ఞతలు!

**హోళగుంద, జూలై 17, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిధిలోని చిన్నహ్యాట గ్రామంలో వేధిస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. చిన్నహ్యాట గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరు బావి ఉన్నప్పటికీ, దానికి సరైన విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు, మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. గ్రామస్తుల కష్టాలను గమనించిన క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వీరేంద్ర, ఈ తాగునీటి సమస్యను గురువారం నాడు టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ప్రజల కనీస అవసరాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదనీ, వెంటనే చిన్నహ్యాట గ్రామంలోని బోరుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి అని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

**24 గంటల్లోనే పరిష్కారం -- గ్రామస్తుల హర్షం:**


వైకుంఠం జ్యోతి ఆదేశాలతో అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. వినతి అందిన 24 గంటలు గడవకముందే బోరు వద్ద కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో బోరు మోటారు పునఃప్రారంభమై గ్రామస్తులకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఏళ్ల తరబడి నానా అవస్థలు పడ్డ తమ తాగునీటి సమస్యను కేవలం ఒక్క రోజులో పరిష్కరించడం పట్ల చిన్నహ్యాట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు అండగా నిలిచిన వైకుంఠం జ్యోతికి, చొరవ చూపిన క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వీరేంద్రకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదివాసుల హక్కుల పరిరక్షణే లక్ష్యం.. రంపచోడవరం మహాగర్జన సభను విజయవంతం చేయాలని గ్రామాల్లో విస్తృత ప్రచారం



**కూనవరం, జూలై 17: ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న రంపచోడవరంలో నిర్వహించనున్న భారీ ఆదివాసి గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని అఖిలపక్ష ఆదివాసి గూడెం, అయ్యవారిగూడెం, పల్లూరు, బొజ్జరాయి గూడెం, రేగులపాడు, లింగాపురం, కోడేరు, బురదగూడెం తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో అన్ని రాజకీయ పార్టీల ఆదివాసి నాయకులు, ఆదివాసి ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, మేధావులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో మహాగర్జన సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అలాగే ఆదివాసులకు గతంలో అమలులో ఉన్న జీవో నెం.3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్ని ఆదివాసి సంఘాలు, రాజకీయ నాయకులు విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆదివాసి నాయకులు తెల్లం తమ్మయ్య, బాబు బోరయ్య, రాజ్ కుమార్ మడకం నాగమణి, ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, గుండం బుచ్చమ్మ, బొగ్గ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు రూ.80 వేల విలువైన విద్యా సామగ్రి పంపిణీ







**చింతకొమ్మదిన్నె, జూలై 17 (ప్రజాజ్యోతి):** చింతకొమ్మదిన్నె మండలం జె.కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం రెడ్డమ్మ తల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పపెంట, పెద్దకాంపల్లి పంచాయతీల పరిధిలోని 13 ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి చేతుల మీదుగా సుమారు రూ.80 వేల విలువైన నోట్ పుస్తకాలు, పలకలు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాలగిరి అయ్యవారయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూత అందించాలన్న తమ తల్లి రెడ్డమ్మ ఆశయాన్ని కొనసాగించేందుకు రెడ్డమ్మ తల్లి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు రెడ్డమ్మ తల్లి ఎక్సలెన్స్ అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు ట్రస్ట్ తరఫున సాధ్యమైనంత సహాయం అందిస్తామని చెప్పారు. పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ తల్లి ఆశయాన్ని సేవా కార్యక్రమాల ద్వారా కొనసాగిస్తూ పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణులు పి. సుజాత, బి. రమాదేవి, తెలుగుదేశం పార్టీ నాయకులు గంధం మోహన్, టి. కృష్ణారెడ్డి, 13 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో ఎస్ ఆర్ కళాశాల విజయభేరి.




**ముత్తుకూరు, జూలై 17 (ప్రజా జ్యోతి)** నీట్ ఫలితాల్లో ఎస్ ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయ బేరి మోగించినట్లు చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం ఫలితాలు విడుదల కావడం జరిగింది. నెల్లూరు జిల్లా కేంద్రంగా ఉన్న ఎస్ ఆర్ విద్యాసంస్థ ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. వీరయ్య గారి సాహ్యు అనే విద్యార్థి ఆల్ ఇండియా స్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు తెలియజేశారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ విద్యాసంస్థకు చెందిన ఆర్ శిరీష, యు ఆశ్రిత, ఆర్ హారిక, గంగాదేవి, ఎం తివేదిక, ఎస్ జాహ్నవి, పి అక్షయ అనే విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో ఎంబిబిఎస్ సీట్లు సాధించినట్లు కళాశాల ఈ సందర్భంగా తెలిపింది. ఈ ఘనవిజయంలో విశేషంగా కృషి చేసిన అధ్యాపకులు యాకయ్య, వెంకటేశ్వర్లు, ప్రసన్న కుమార్ , కిషోర్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సురేంద్ర రెడ్డి, జిఎం రాజేంద్రప్రసాద్, డిజిఎం గోవర్ధన్ రెడ్డి, డీన్ అరవింద్, బైపిసి కోర్ డీన్ సుధాకర్, జోనల్ ఇన్చార్జి కే శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు పంటల బీమా నమోదు గడువు పొడిగింపు

**జూలై 31 వరకు అవకాశం**



**హోళగుంద,జూలై 17,సాక్షి డిజిటల్ న్యూస్** ఖరీఫ్--2026 సీజన్‌లో రైతులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద లోనీ, నాన్-లోనీ రైతుల నమోదు గడువును జూలై 31 వరకు పొడిగించినట్లు ఏవో ఆనం ద్ లోక్ దళ్ తెలిపారు. ఇప్ప టి వరకు బీమా నమోదు చేసుకోని అర్హులైన రైతులు సమీపంలోని బ్యాంకు లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆలస్యం చేయకుండా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. ముఖ్యమైన వివరాలు జూలై 16 నుంచి జూలై 31 మధ్య నమోదు చేసుకునే రైతులకు బీమా రక్షణ ఆగస్టు 1, 2026 నుంచి మాత్రమే అమలులో ఉంటుందని తెలిపారు. జూలై 1 నుంచి జూలై 31 వరకు సంభవించిన వాతావరణ నష్టాలకు బీమా క్లెయిమ్ వర్తించదన్నారు. జిల్లాలోని రైతులందరూ చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే నమోదు చేసుకొని పంటలకు బీమా రక్షణ పొందాలని సూచించారు.

# బేటీ బచావో--బేటీ పడావోపై విద్యార్థులకు అవగాహన



**చింతకొమ్మదిన్నె, జూలై 17 (ప్రజాజ్యోతి):** చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని సి.కె.దిన్నె, నాగిరెడ్డిపల్లి, మూలవంక ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల రక్షణ, విద్య ప్రాధాన్యత, బాల్య వివాహాల నివారణ, బాలికల హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శ్రీదేవి, వెంకటలక్ష్మమ్మ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రహమతున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురుషోత్తపట్నం ర్యాంప్‌లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి!

**పిసా చట్టానికి విరుద్ధంగా అధికారుల వ్యవహారం**

**కమిటీ తీర్మానం లేకుండానే అనుమతులా?కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం**

**న్యాయవాది, పిసా కమిటీ కార్యదర్శి వలవల సురేష్ కుమార్**



**ఎటపాక, జూలై 17 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం ఇసుక ర్యాంప్ నుంచి ప్రతిరోజూ అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతోందని, పిసా చట్టానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రముఖ న్యాయవాది, పురుషోత్తపట్నం పిసా కమిటీ కార్యదర్శి వలవల సురేష్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పిసా కమిటీ తీర్మానం లేకుండానే పురుషోత్తపట్నం ఇసుక ర్యాంప్ నుంచి ఇసుక రవాణాకు అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నప్పటికీ, కొందరు ఇసుక మాఫియాగా ఏర్పడి ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు.

**అధికారుల నిర్లక్ష్యంపై విమర్శల జడి..**

“ఇంత పెద్ద ఎత్తున పగలు, రేయి అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కంటిచూపు మేరలో లేకపోవడం ఆశ్చర్యకరం. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటి?” అని సురేష్ కుమార్ ప్రశ్నించారు. అధికారుల ఉదాసీనత వల్లే ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని విమర్శించారు.

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం!**

మండలంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాను సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ దోపిడీ వ్యవహారంపై సమగ్ర ఆధారాలతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అక్రమార్కులతో పాటు సహకరిస్తున్న అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాడతామని వలవల సురేష్ కుమార్ హెచ్చరించారు.

# గొర్రెలు మేపడంపై వివాదం

**: వృద్ధుడిపై కత్తితో దాడి**

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పొలంలో గొర్రెలు మేపవద్దని వారించినందుకు ఒక వృద్ధుడిపై కత్తి, కర్రలతో దారుణంగా దాడి చేసిన ఘటన కొడవలి గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొడవలి గ్రామానికి చెందిన తోట నూకరాజు అలియాస్ రాజబాబు (66) అనే రైతు గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో పుష్కర కాలువ అంచున ఉన్న తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్నారు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన గింజల బాబి అనే వ్యక్తి తన గొర్రెలను నూకరాజు పొలంలోకి తోలాడు. నా పొలంలో గొర్రెలను ఎందుకు మేపుతున్నావని నూకరాజు ప్రశ్నించగా.. "మా ఇష్టం వచ్చిన చోట మేపుతాం, అడగడానికి నువ్వు ఎవరివి?" అంటూ బాబి దౌర్జన్యంగా సమాధానం చెప్పాడు. దీంతో నూకరాజు గొర్రెలను బయటకు తోలేందుకు ప్రయత్నించారు. ఆగ్రహానికి గురైన గింజల బాబి తన చేతిలో ఉన్న దొంకి కత్తితో నూకరాజు తలపై బలంగా నరికాడు.




అనంతరం కర్రతో వీపుపై విచక్షణారహితంగా బాదాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావమై నూకరాజు పొలంలోనే స్పృహతప్పి పడిపోగా, నిందితుడు బాబి అక్కడి నుంచి పారిపోయాడు. గమనించిన స్థానికులు వృద్ధుడిని ఇంటికి చేర్చారు. బాధితుడి కుమారుడు వెంటనే ఆయన్ను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు సబ్ ఇన్స్పెక్టర్ నౌడ్ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

## పంట బీమా పొడిగింపు ఈ అవకాశం రైతులు సద్వినిగం చేసుకోవాలి....

వ్యవసాయ అధికారి శేషాద్రి



**కౌతాళం జూలై 17 ప్రజా జ్యోతి** కౌతాళం మండలంలోని రైతులందరికీ శుభవార్త ఈనెల 15వ తేదీ నా పంటల బీమాకు తుది గడువు పత్తి పంటకు వేరుశనగ పంటకు ఉండేది, మన జిల్లా కలెక్టర్ గారి చరవతో మన కర్నూలు జిల్లాకు వాతావరణ ఆధారిత పంటల బీమా పత్తి పంట మరియు వేరుశనగ పంటకు నాన్ లోని ఫార్మర్స్ బీమా చేసుకొనుటకు గాను ఈ నెల చివరి తేదీ 31వ తేదీ వరకు గడువు పొడిగించడం అయినది,ఇదివరకే లోని ఫార్మర్స్ కు బ్యాంకులో లోను తీసుకున్న వాళ్లకు కూడా 31వ తేదీ వరకు ప్రీమియం చెల్లించుటకు అవకాశం కల్పించి ఉన్నారు. అంతేకాకుండా అన్ని పంటలో కూడా ఈనెల 31వ తేదీ వరకు ఆర్డబ్ల్యుబిసిఐఎస్ మరియు పీఎం ఎఫ్బివై అన్ని మీసేవ,సిఎస్సి సెంటర్లు నందు ప్రీమియం చెల్లించి పంటల బీమా చేసుకోగలరు. కావున కౌతాళం మండలంలోని రైతులు అందరు కూడా ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటల భీమా తప్పనిసరి చేసుకోవాల్సిందిగా కౌతాళం మండల వ్యవసాయ అధికారి శేషాద్రి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## రోగులకు వసుధ ఫౌండేషన్ రూ. 20 వేలు ఆర్థిక సాయం.



**పాలకొల్లు / పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. జూలై 17.** అనారోగ్యం తో బాధపడుతున్న ఇద్దరు రోగులకు వసుధ పౌండేషన్ మంతెన వెంకట రామరాజు రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. పోడూరు గ్రామానికి చెందినగంటా సావిత్రికి, అల్లూరి రాముడుకి ఒక్కొక్కరికి 10వేల రూపాయలు వంతున పంపిన చెక్కులను వసుధ ఫౌండేషన్ పాలకొల్లు కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూర్యనారాయణ రాజు (సూరిబాబు ) అనారోగ్య బాధితులకు అందచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పోడూరు గ్రామ మాజీ సర్పంచ్ సువర్ణ రాజు, గ్రామ పెద్ద పొత్తూరి రామకృష్ణం రాజు మాట్లాడుతూ అనారోగ్యంతో, పేదరికంతో బాధపడుతున్న వారికి పెద్ద మనస్సుతో ఆర్థిక సాయం అందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు కన్వీనర్ శ్రీ పెన్మెత్స బుద్ధరాజులు అభినందనీయులన్నారు. చెక్కులు అందుకున్న రోగులు వసుధ పౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు

## రెండు షైనింగ్ స్టార్స్ అవార్డులను దక్కించుకున్న స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్





**తాళ్లపూడి, జూలై 17, ప్రజాజ్యోతి న్యూస్** పదవతరగతి 2026 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ధర్మవరం విద్యార్థులు పోలిశెట్టి వర్షాంజలి 596/600,...బెల్లపుకొండ నయన వెంకట సత్య శ్రీ 593/600 లకు ప్రభుత్వం నుండి షైనింగ్ స్టార్ ప్రతిభఅవార్డులకు ఎంపికైన సందర్భంగా స్కూల్ యాజమాన్యం కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పేరిచర్ల పద్మ, స్కూల్ ఇన్ చార్జెస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కొవ్వూరు మండలంలోని అత్యధిక ప్రతిభ కనబరచిన విద్యార్థులలో తమ విద్యార్థులు ఈ అవార్డుకు ఎంపికైనందుకు తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

## దోమ కాటు ఆరోగ్యానికి హానికరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**బేతంచెర్ల: జూలై 17, (ప్రజా జ్యోతి)** బేతంచర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో దోమకాటు వల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అందరూ దోమల నివారణకు సహకరించాలని సూచించారు. ఇళ్లలో, పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, వాటిలో దోమల లార్వా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం నీటి నిల్వ తొట్లను పూర్తిగా ఖాళీ చేసి, శుభ్రంగా కడిగి ఆరబెట్టిన తర్వాత మాత్రమే కొత్త నీటిని నింపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా విద్యాలయ ప్రిన్సిపల్ అబీదా బేగం, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సహాయకులు రామాంజనేయులు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడు మండలాల జనసేన ముఖ్య నాయకుల సమావేశం లో పాల్గొన్న వేలేరుపాడు జనసేన నాయకులు

**వేలేరుపాడు : 17 జూలై వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** శుక్రవారం నాడు మీూా చిర్రి బాలరాజు గారి అధ్యక్షతన బర్రింకలపాడు జనసేన క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో, ఏడు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వేలేరుపాడు మండలం నుండి మండల ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్ ఆధ్వర్యం లో భారీగా కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేలేరుపాడు మండల సమస్యలు, జరగాల్సిన అభివృద్ధి పనులు గురించి కార్యక్రమం లో చర్చించడం జరిగింది. త్వరలో జరబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి, జరుగుతున్న సర్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు, నాయకులకు,కార్యకర్తలకు ఎలా ఎన్నికల్లో పాల్గొనాలో దిశా నిర్దేశం చేశారు, అలాగే వేలేరుపాడు మండలానికి సంబందించి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ లను



ఎమ్మెల్యే బాలరాజు ప్రధాన కార్యదర్శి సంజయ్ కీ ఇచ్చి కూటమి నాయకుల ఆధ్వర్యంలో చెక్ లను పంపిణి చేయమని కోరారు,ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి శివరామ్, బేతి శివ,చంటి, భాను,కే, ప్రవీణ్ వంశీ, శ్రీనివాస్ రెడ్డి, ఏ దొరబాబు,అన్వేష్, లక్ష్మయ్య,కిరణ్, రజిని, కన్నయ్య, వెంకీ, మహేష్, కళావతి, రామ్, లక్ష్మణ్,రంజిత్,మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ బ్రేకింగ్" కేసులో ముద్దాయి అరెస్ట్

**నంద్యాల పాణ్యం ప్రజాజ్యోతి:జులై=17** 2026 సంవత్సరం జూలై 12వ తేదీన సాయంత్రం పాణ్యం మండలం కొండజూటూరు గ్రామానికి చెందిన శ్రీమతి వన్నం విజయలక్ష్మి ఇంటిలో, ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని ఉపయోగించి లోనికి ప్రవేశించి, బీరువాలో ఉన్న నగదు రూ. 3,24,000/-ను అపహరించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీ నరేంద్ర కుమార్ రెడ్డి కేసు నమోదు చేశారు. నంద్యాల యస్ పి . శ్రీ సునీల్ షోరాన్ ఐపియస్ గారి ఆదేశాల మేరకు, దర్యాప్తులో భాగంగా నంద్యాల ఎస్‌డీపీఓ శ్రీమతి సుష్మిత, ఐపియస్ గారి పర్యవేక్షణలో, పాణ్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి , ఎస్ఐ శ్రీ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు సిబ్బంది సూర్య, నాగరాజు, వెంకటేష్ నాయక్ మరియు నాగార్జునలు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించడం, సాంకేతిక ఆధారాలను సేకరించడం ద్వారా ముద్దాయి మంజలి వెంకట రమణ (తండ్రి: లక్ష్మణ్, వయస్సు: 36 సంవత్సరాలు, నివాసం: కొండజూటూరు గ్రామం, పాణ్యం మండలం)ను 17-07-2026 తేదీ ఉదయం కొండజూటూరు గ్రామ శివారులోని కొట్టాల రహదారి వద్ద ఉన్న మామిడి తోటలో అరెస్ట్ చేశారు. ముద్దాయి వద్ద నుండి



చోరీకి గురైన నగదు రూ.3,24,000/-తో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు పంపించడమైనది. త్వరిత గతిన కేసును చేధించినందుకు పాణ్యం సిఐ, యస్ ఐ మరియు సిబ్బంది ని నంద్యాల ఎస్పీ శ్రీ సునీల్ షోరాన్ ఐపిఎస్ మరియు నంద్యాల ఎఎస్ పి శ్రీమతి సుష్మిత ఐపిఎస్ గార్లు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు పోలీస్ వారి విజ్ఞప్తి: ఇంటి తాళాలను ఇంటి బయట గూళ్లలో, బట్టల కింద, బాత్‌రూమ్ గూళ్లలో లేదా ఇతరులకు సులభంగా కనిపించే ప్రదేశాల్లో ఉంచకుండా జాగ్రత్త వహించండి.

## ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతులు

వానదేవుడా, కరుణించు



**హాలహర్వి మండలం జూలై 17, ప్రజాజ్యోతి :-** ప్రస్తుత సంవత్సరంలో నైరుతి రుతుపవనాల వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత సంవత్సరం ఇదే సమయంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగాయి. అయితే ఈ ఏడాది జూలై నెల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనికి ఉదాహరణగా హాలహర్వి మండల పరిధిలోని గుళ్యం, సిద్దాపురం,పచ్చారపల్లి,బాపుర, నిట్రవట్టి గ్రామ రైతులు మెరప విత్తనాలు ఎండు పొలాల్లో విత్తుకొని మరి కొంతమంది రైతులు విత్తడానికి సిద్ధం చేసి, వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. "వానదేవుడా కరుణించు" అంటూ ఆకాశం వైపు ఆశగా చూస్తూ రోజులు గడుపుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల జీవనం ఆందోళనకరంగా మారింది. విత్తనాలు వేసేందుకు అవసరమైన వర్షాలు లేకపోవడం, మరోవైపు తుంగభద్ర జలాశయం కూడా పూర్తిగా నిండకపోవడం రైతుల ఆందోళనను మరింత పెంచుతోంది. ప్రగతిశీల రైతులు కె. రాము, హనుమంత, నాగరాజు తదితరులు మాట్లాడుతూ, "ఇప్పటికైనా వర్షాలు కురిసి సాగు పనులకు అనుకూల పరిస్థితులు ఏర్పడాలి. రైతులకు అండగా వానదేవుడు కరుణించాలి" అని తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు.రైతులు మంచి వర్షాల కోసం ఎదురుచూస్తూ, వ్యవసాయ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అనుకూల వాతావరణం ఏర్పడాలని అన్ని గ్రామాల్లో దేవుళ్లకు 101 బిందె నీళ్లు వేసి పూజలు ,యాగాలు, చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల వైఫల్యంతో రైతుల్లో ఆందోళన పెరిగినప్పటికీ, త్వరలోనే మంచి వర్షాలు కురుస్తాయనే ఆశతో అన్నదాతలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

# ప్రమాదాన్ని హత్యగా చిత్రీకరిస్తారా?

కూటమి నాయకుల తీరు ఆక్షేపనీయం

- కక్షపూరిత రాజకీయాలు తగదు
- తప్పుడు కేసులతో సరికొత్త సంప్రదాయానికి తెర
- కూటమి నాయకుల తీరు మారకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆముదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్




**ఆమదాలవలస::: ప్రజా జ్యోతి** రోడ్డు ప్రమాదాన్ని కూడా హత్యగా చిత్రీకరిస్తున్న కూటమి నాయకులు తీరు ఆక్షేపనీయంగా ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆముదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆముదాలవలస వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో వాక్ స్వాతంత్రం కూడా కరువైందని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా అందజేసి కేసును తారుమారు చేయించే విధంగా వారిపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. గతంలో ఎన్ని రోడ్డు ప్రమాదాలు జరిగాయి ఎంతమందికి పరిహారం చెల్లించారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. పదవ తేదీ రాత్రి ప్రమాదం జరిగితే మృతుని భార్య దువ్వ ద్రౌపది 11వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేస్తూ సిద్దార్థ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదం చేయడంతో తన భర్త దానయ్య మృతి చెందాడని తన కాలనీకీ చెందిన ఇద్దరు వ్యక్తులు తనకు చెప్పారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నమోదు చేశారు. ఈ ఎఫ్ ఐ ఆర్ ఆధారంగా సిద్దార్థ పై 304 సెక్షన్ కింద కేసును నమోదు చేసినట్టు వివరించారు. అయితే 13న జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీనివాసరావు మృతిని ఇంటికి వెళ్లి పది లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించడంతో 13న ఆమె తన భర్తను యాక్సిడెంట్ చేసింది సిద్ధార్థ కాదు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు అని చెప్పి తిరిగి బి.ఎన్.ఎస్ ప్రకారం సెక్షన్ 105 కేసు నమోదు చేయించారని వివరించారు. అప్పలరాజును మానసిక ఇబ్బంది పెట్టాలని ఆలోచనతోనే దీనిని మర్డర్ కేసుగా చిత్రీకరించారని చింతల రవికుమార్ వివరించారు. రాజకీయ కక్షతో ఇటువంటి తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదన్నారు కూటమి ప్రభుత్వంలో సరికొత్త రాజకీయాలకు తెర లేపుతున్నారు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కూటమి పాలన తీరు దారుణంగా ఉందని రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ప్రజలను అనునిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులకు ప్రతి విషయంలోనూ రాద్ధాంతం చేయడం అలవాటుగా మారిపోయింది అని చెప్పారు. ఇప్పటివరకు ఎన్ని రోడ్డు ప్రమాద ఘటనలో బాధితులకు ఎక్స్‌గ్రేషన్ అందించారు చెప్పాలని ప్రశ్నించారు. భవిష్యత్తులో ప్రజలు ఓటమి నాయకులకు బుద్ధి వచ్చే విధంగా ఓటుతో బుద్ధి చెప్తారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు గురుగుబిల్లి పెంటయ్య, జీడి వేణు, సురవరపు నాగేశ్వరరావు, మెట్ట వసంతరావు, గురుగుబిల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే వేతనాలు చెల్లించాలి

మహిళా ఉద్యోగులందరికీ మెటర్నిటి లీవులు ఇవ్వాలి

విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే నడపాలి

ఆర్టీసీ 1డ2 డిపో మేనేజర్లకు వినతి పత్రం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు

జూలై 27న చలో విజయవాడ విజయవంతం చేద్దాం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



**మదనపల్లి జూలై 17 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే ప్రతినెల వేతనాలు చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నటి లీవులు ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ,ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గౌరీ శంకర్ ప్రభుత్వాన్ని కోరారు.ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం మదనపల్లి 1డ2 డిపో మేనేజర్లకు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8,000 మంది కార్మికులు ఆర్టీసీ వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని, వారికి చెల్లించే వేతనాలు ఆర్టీసీ ద్వారానే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో థర్డ్ పార్టీ, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేయాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ గుర్తింపు కార్డులు మంజూరు చేసి, డ్యూటీలకు వచ్చేవారికి ఆర్టీసీ బస్సులో ఉచిత సౌకర్యం కల్పించాలని కోరారు.వారాంతపు సెలవులు తోపాటు జాతీయ సెలవులు, రాష్ట్ర సెలవులు సౌకర్యం కల్పించాలని కోరారు విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన వారికి మెసేజ్ మెంట్ ద్వారా ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ బస్సులను ప్రైవేటు ఆపరేటర్లతో కాకుండా ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే నడపాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ జూలై 27న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమంలో ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రమణప్ప,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఎంఆర్ఎఫ్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్



**బేతంచెర్ల, జూలై 17,(ప్రజా జ్యోతి)** బేతంచెర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ ఎఫ్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ,కలెక్టర్ పాల్గొనున్నారు. ప్రజలు తడి చెత్త, పొడి చెత్త హానికరమైన చెత్త వేరు చేసి బహిరంగ ప్రదేశాలలో కాలువలలో పడకుండా అలాగే పారిశుద్ధ కార్మికుల కు అందచేయాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ తెలియజేశారు. కావున ప్రజలు ఎంఆర్ఎఫ్ ప్లాట్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు. సందర్భంగా బేతంచెర్ల మున్సి పల్ కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడు తూ... స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె రోడ్డులోని డంప్ యార్డ్ ప్రాంగ ణంలో నిర్మించిన ఎంఆర్ఎఫ్ను శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.పట్టణంలో సేకరించే ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి, పునర్వినియోగ పదార్థాలను రీసైక్లింగ్కు పంపించేందుకు ఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతుందని కమిషనర్ తెలిపారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణకు ఈ కేంద్రం దోహదం చేస్తుందని పేర్కొంటూ, అలాగే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్మార్ట్ కిచెన్ ద్వారా అమలవుతున్న డొక్క సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన ఆర్డీవో చంద్రమోహన్



**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి జులై 17** బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ కిచెన్ ద్వారా అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించా లన్నదే ప్రభుత్వ లక్ష్యమని అదేవిధంగా ప్రతిరోజు మెనూ తప్పక పాటించాలని సిబ్బందికి తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఎంఈఓలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ నాయకుడు పూజ శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్ షెల్టర్ చుట్టూ తోపుడు బండ్లేనా- ప్రయాణికులు వెళ్లాలంటే ఎలా?



**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి జులై 17** మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సొంత నిధులతో బస్ షెల్టర్ ను ఏర్పాటు చేశారు.సోషల్ మాధ్యమాలలో బ్రహ్మంగారి మఠానికి కనీసం బస్ షెల్టర్ కూడా లేదు అంటూ ప్రచారాలు సాగడంతో స్పందించిన ఎమ్మెల్యే భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం కోసం బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం జరిగినది.అయితే ఈ బస్ షెల్టర్ చుట్టూ తోపుడు బండ్లు పెట్టుకొని కనీసం ప్రయాణికులు బస్సు షెల్టర్ లోకి పోవడానికి కూడా వీలు లేనంత పరిస్థితులు ఉన్నాయి. స్థానిక ఎస్సై బస్ షెల్టర్ వద్దకు వెళ్లి తోపుడు బండ్లు తీసేయాలని చెప్పినప్పటికీ ఏమాత్రం లెక్క చేయడం లేదు. అధికారుల సైతం చెప్పినప్పటికీ కొంచెం కూడా మానవత్వంతో ఆలోచించి తొలగని పరిస్థితి ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్ షెల్టర్ చుట్టూ తోపుడు బండ్లు లేకుండా చూడాలని వారు తీయక పోతే వారి పైన చర్యలు తీసుకోవాలని బ్రహ్మంగారి దర్శనానికై వచ్చే భక్తులు,ప్రయాణికు,మరియు స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు

## “షైనింగ్ స్టార్స్ అవార్డును సొంతం చేసుకున్న మాంటిస్సోరి హై స్కూల్



**తాళ్లపూడి, జూలై 17, ప్రజాజ్యోతి న్యూస్** 10వ తరగతి 2026 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన తాళ్లపూడి మాంటిస్సోరి హై స్కూల్ కి చెందిన కత్తిరి సంజన 578/600 కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో “షైనింగ్ స్టార్స్ అవార్డు” ను సాధించడం పట్ల మాంటిస్సోరి హై స్కూల్ కరస్పాండెంట్ వి.వి. అనిష్ విద్యార్థిని అభినందిస్తూ మా హై స్కూల్ కు రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడం చాలా గర్వకారణమని ఇలాంటి విజయాలు సాధించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.అవార్డుకు ఎంపిక కాబడిన విద్యార్థిని ఉపాధ్యాయులు మరియు తోటి స్నేహితులు అభినందనలు తెలియజేశారు

## ఆషాఢమాసం సందర్భంగా శ్రీ శివ గంగా భవాని మాతకు వైభవంగా చీర సారే సమర్పణ..........

శాకాంబరీ దేవిగా అవతారమెత్తిన గంగా భవాని అమ్మవారు.........



**చాగలమర్రి , జులై 17( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రిలో శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా శ్రీ గంగా భవాని అమ్మవారికి మహిళల ఆధ్వర్యములో చీర సారే సమర్పించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.శ్రీ లలిత విష్ణు సహస్రనామాలు పఠించారు.భక్తుల ఆధ్వర్యములో హారతులు వెలిగించి అమ్మవారికి దశ దీప హారతులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మేకల శ్రీనివాసులు ధర్మపత్ని రామలక్ష్మి మేకల నాగేంద్ర ధర్మపత్ని స్వర్ణలత , తొమ్మంద్రు సుప్రజ , మిట్టా అనిత కర్నాటి రమాదేవి వీరంరెడ్డి సుబ్బలక్ష్మి , సమరసత సేవా ఫౌండేషన్ సంయోజిత మహిళా కన్వీనర్ యల్లంపల్లె లక్ష్మీదేవి సహా కన్వీనర్ బచ్చు సునీత వీరంరెడ్డి స్వర్ణలత భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కనెక్టింగ్ మీటింగ్ - గంజాయి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించిన ఎస్సై టి రామకృష్ణ



**తాళ్లపూడి, జూలై 17, ప్రజాజ్యోతి న్యూస్** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ మరియు కొవ్వూరు రూరల్ సీఐ ఆదేశాల మేరకుతిరుగుడుమెట్ట గ్రామంలోయూత్ కనెక్టింగ్ మీటింగ్” ను ఏర్పాటు చేసినట్లు తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతకు ఎస్సై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ యువతను చెడు వ్యసనాల బారినుండి కాపాడడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఒకసారి ఈ వ్యసనాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుంది. చదువు, ఉద్యోగం, కుటుంబం అన్నీ పాడవుతాయి” అని యువతకు అవగాహన కల్పించారు.మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, అమ్ముతున్న వారి గురించి తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినా, అనుమానాస్పదంగా తిరుగుతున్నా వారి వివరాలను పోలీసు వారికి తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతా యని అన్నారు.యువత భవిష్యత్తు బాగుండాలంటే మన ఊర్లు డ్రగ్స్ రహితంగా ఉండాలని పోలీసులకు ప్రజలు సహకరించాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, గ్రామంలోని యువత పాల్గొన్నారు

## గొర్లకుంట తూము రిపేరు చేయక రైతుల అవస్థలు



**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ జూలై 17 (ప్రజా జ్యోతి)** బద్వేల్ మండలం ఎత్తి రాజు పల్లి గ్రామానికి చెందిన గొర్లకుంట సర్వేనెంబర్ 40/1 లో128 ఎకరాల విస్తీర్ణం కలదు ఈ యొక్క చెరువు కింద ఎత్తి రాజు పల్లె, తిమ్మరాజు పల్లె గ్రామాలకు చెందిన రైతుల భూములు సుమారు 150 ఎకరాల పారుదల కలదు అలాంటి చెరువుకు సంబంధించి తూము సుమారు గత ఐదు సంవత్సరాలు నుండి విరిగిపోయి పూర్తిగా పనిచేయకపోవడంతో రైతులు పైరు పండించుకొనుటకు అనేక ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయిన ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో పై రెండు గ్రామాలకు చెందిన రైతులు పంట పండించుకొనుటకు చెరువులో నీరు లేకుండా పోతుంది. అందువలన రైతులు పైరు పెట్టుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అదేవిధంగా తెలుగు గంగ నుంచి వచ్చే నీటిని కూడా మేము తూము సరిగా లేకపోవడంతో వాటిని కూడా వినియోగించుకోలేక నష్టపోతున్నామని ఎత్తి రాజుపల్లె గ్రామానికి చెందిన రైతులు నాగేండ్ల వెంకటసుబ్బారెడ్డి, శనివారపు రామిరెడ్డి, శనివారపు వెంకటసుబ్బారెడ్డి, బుసగాని చెన్నయ్య, ఎర్ర చెన్నయ్య, లగసాని చిన్నయ్య, దుంపల గంగిరెడ్డి,వారి ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయమై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ కూడా ఏమాత్రం స్పందించలేదని వారన్నారు అదేవిధంగా మా గ్రామానికి చెందిన గొర్లకుంట ను ఎత్తి రాజు పల్లె కు చెందిన ఒక్కొక్కరు నాలుగు ఎకరాలు చొప్పున చెరువును ఆక్రమించి బోర్లు వేసుకుని కబ్జాకు పాల్పడ్డారని వారు ఆరోపించారు ఇప్పుడు మా గ్రామం రీ సర్వే జరుగుతున్నందున మా గ్రామ చెరువు అయిన గొర్లకుంటను పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి భూ కబ్జాదారుల నుండి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరారు

## నాగేండ్ల .వెంకటసుబ్బారెడ్డి



మా గ్రామానికి చెందిన కొంతమంది మా చెరువు అయినా గొర్లకుంటను పూర్తిగా ఆక్రమించుకొని కబ్జాకు పాల్పడడంతో చెరువు పూర్తిగా కుషించుకుపోయి నీరు నిలువక రైతులు పంటలు పండించుటకు సరిపడా నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము కావున వెంటనే సంబంధిత అధికారులు చెరువును పూర్తిస్థాయిలో కొలతలు వేసి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోనీ వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము

## జంట హత్యల కేసులో బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్




**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి జులై 17** బ్రహ్మంగారి మఠం మండలంలో జరిగిన ఇద్దరు మాదిగ యువకుల జంట హత్యల ఘటనపై గత ఐదు నెలలుగా మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగుతున్నాయి.ఎమ్మార్పీఎస్ ఉద్యమాల ఫలితంగా శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ మఠం మండలంలోని ముడుమాల మరియు గుండాపురం గ్రామాలను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మృతదేహాలు లభించిన తెలుగు గంగ కాలువను ప్రత్యక్షంగా పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నిజనిర్ధారణ బృందం, ఘటన జరిగిన రోజు నుంచి ఇప్పటి వరకు పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అధికారుల వైఫల్యాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. అలాగే కేసును తప్పుదోవ పట్టించేలా ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో మఠం ఎస్సై వ్యవహరించిన తీరును ఆధారాలతో వివరించింది.ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం ఈ కేసులో సంబంధిత ఎస్సై, సీఐలను ప్రధాన ముద్దాయిలుగా చేర్చి వెంటనే సస్పెండ్ చేయాలని, కేసు దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా నిష్పక్షపాతంగా, వేగంగా నిర్వహించాలని డిమాండ్ చేసింది. అలాగే ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రావడానికి రీ-పోస్ట్మార్టం నిర్వహించాలని కూడా విజ్ఞప్తి చేసింది.బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

## పార్టీ కార్యకర్తలను పదునైన ఆయుధాలుగా మారుస్తాం

**సిపిఐ పట్టణ కార్యదర్శి బాలు పిలుపు**



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ జూలై 17 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పట్టణంలో శ్రీ సాయి ఫంక్షన్ హాల్, నాగుల చెరువు కట్ట వద్ద మూడు రోజులపాటు జరుగు సిపిఐ కడప జిల్లా శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బాలు పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం,త్రాగునీరు, సాగునీరు, సాధన కొరకు, బ్రహ్మ సాగర్ పిల్ల కాలువలు పూర్తి చేయాలని, అట్లూరు క్రాస్ రోడ్డు చెక్ పోస్ట్ ఎత్తివేసి, కొండ ప్రాంతంలో సైడ్ వాల్ కోసం రెండు కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని, బ్రహ్మ సాగర్ నుండి ప్రతి చెరువుకు నీరు నింపి రైతు కళ్ల లో ఆనందం చూడాలని, రాచెరువును మినీ రిజర్వాయర్ చేయాలని, పట్టణంలో పార్కు, ప్రెస్ క్లబ్, ఏర్పాటు చేయుట కొరకు, అలాగే దేశంలో, రాష్ట్రంలో కార్మికులకు, రైతులకు, విద్యార్థుల, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కొరకు, స్కీం వర్కర్ల సమస్యల కొరకు జరుగు పోరాటాల కోసం, హక్కుల కోసం 18 19 20 తేదీల్లో జరుగు రాజకీయ సైదాంతిక శిక్షణా తరగతులలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకొని, పార్టీ కార్యకర్తలను పదునైన ఆయుధంలా తయారు చేసుకుని ముందుకెళ్లేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఆ విధంగా ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని జిల్లాలోని ప్రతి పార్టీ సభ్యుడు ప్రజాసంఘాల నాయకులు అందరూ హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

## నాయనవారిపల్లి దేవాలయం దర్శనం చేసుకుని ఉడుంవారి పల్లి నూతన బోరు ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి



**రామాపురం జూలై 17 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి స్థానిక దేవాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉడుం వారి పల్లి నందుఏర్పాటు చేసిన నూతన బోరు ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ఆప్యాయంగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ శాకాంబరీ దేవి అలంకారంలో పార్వతి అమ్మవారు.........




**చాగలమర్రి , జులై 17 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని కూరపాటి బజార్ నందు శ్రీ కోదండ రామాలయములో శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా పార్వతి దేవీ అమ్మవారికి మహిళల ఆధ్వర్యములో పండ్లు కూరగాయలతో అల్లి శాకాంబరి దేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చింది.మహిళ మూర్తులు శ్రీ లలిత విష్ణు సహస్రనామాలు పటించారు. అర్చకులు పుల్లేటికుర్తి రాధాకృష్ణ అమ్మవారి విశేష పూజలు జరిపించారు.ఈ కార్యక్రమంలో కూరపాటి సునితాలక్ష్మి తొమ్మండ్రు సుప్రజ మాలేపాటి ప్రసన్నలక్ష్మి, సుంకు కవిత మహిళ భక్తులు ఆలయ అధ్యక్షుడు మదళ్ళపల్లె సత్యనారాయణ కూరపాటి లక్ష్మీనారాయణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ లో ఆర్ఎంపీలు వాడి పడేసిన సీరంజీవిలు, సూదులు, ఇంజక్షన్లు. పట్టించుకోని అధికారులు



**కాట్రేనికోన ప్రజాజ్యోతి** వివరాలు వెళ్తే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం పరిధిలో ఆర్ ఎంపీ, పి యమ్ పి లు వాడిసిన శిరంజీలు, సూదులు, ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పడేయడం జరుగుతుంది.చెయ్యరు గ్రామం నుండి మొల్లేటి మొగ కొత్తపాలెం మరియు బలుస్సుతిప్ప తిరగ్రామాలలో రోడ్లకు ఇరువైపులా సంచులతోనూ కవర్లతోనూ ముటలు కట్టి పడవేయడం జరుగుతుంది గతంలో అనేకసార్లు పలు పత్రికలలో వార్తలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు అధికారులు పట్టించుకోవడంలేదని చుట్టుపక్కల గ్రామ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకి విరివైపులా పడవేయడం వలన మూగజీవులు ప్రాణహాని జరుగుతుందని తీర గ్రామ ప్రజలు తెలుపుతున్నారు మండలంలో ఆర్ యమ్ పి లు,పి యమ్ పి లు రోగులతో చెలగాటం ఆడుతున్నారని మందుల దుకాణాలలో ఇంజక్షన్లు తీసుకుని ఒక్కో రోగికి ముప్పై రూపాయలు ఇంజక్షన్‌ని వంద రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి ఒకే ఇంజక్షన్లు ఇద్దరు ముగ్గురికి చేస్తున్నారని సూదులు మార్చడం లేదని ఆర్ఎంపి లు విఎంపీలు ఒక్కొక్కరు చిన్న చిన్న రూముల్లో ఆసుపత్రులు ఏర్పాటు చేసి వారి వద్ద నుండి మందులు పై అధిక రేట్లు వసూలు చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్ఎంపీలు, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలి మరియు డంపింగ్ యార్డ్ లలో రోడ్డుకి విలువైపులా పడవేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు

## ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన తిమ్మాపురం రైతులు




**కంబదూరు జూలై 17:(ప్రజా జ్యోతి) న్యూస్** కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలోని సర్వే నంబర్ 42/2లెటర్ లో ఉన్న వంక పోరంబోకు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ మాజీ జెడ్పి విపక్షనేత కరణం రామ్మోహన్ చౌదరి, తిమ్మాపురం గ్రామ రైతులతో కలిసి శుక్రవారం తహశీల్దార్ బాలకిషన్ కు వినతిపత్రం అందజేశారు. తిమ్మాపురం గ్రామంలో ప్రభుత్వ భూములు, కుంటలు, స్థలాలను వేరే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.కంచెలు ఏర్పాటు చేయడం వల్ల రైతులు వ్యవసాయ పనులు, చేసుకునే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించి, వాటిని రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ,ప్రజలు పాల్గొన్నారు.

# వ్యక్తిగత దూషణలు మాని ప్రజా సమస్యలపై మాట్లాడాలి

**వైఎస్ఆర్‌సీపీ నాయకులు**



**ఎమ్మిగనూరు జులై 18 (ప్రజా జ్యోతి ):** స్థానిక పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వారం రోజులుగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సోషల్ మీడియా వేదికగా తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజలకు చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలకే పరిమితమవడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. తమ పార్టీ అధినేతల మెప్పు కోసం ఇలాంటి సంస్కారహీన వ్యాఖ్యలు చేస్తే ప్రజలు వాటిని గమనిస్తున్నారని, అలాంటి రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ సమర్థించరని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలకు ప్రతి విమర్శలు సహజమే కానీ వ్యక్తిగత దూషణలకు స్థానం ఉండదన్నారు. వ్యక్తిగత విమర్శల సంస్కృతికి ఎవరు శ్రీకారం చుట్టారో ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు బాగా తెలుసని పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న గత ఐదు సంవత్సరాల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని గుర్తు చేశారు.టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల కుటుంబాలకు కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హయాంలో సంక్షేమ పథకాల నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు.అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు ఎంత మేరకు అమలు చేశారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు ప్రభుత్వ హామీల అమలుకు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని అన్నారు.ప్రస్తుతం పెన్షన్ మంజూరులో కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒక కుటుంబంలో భార్య లేదా భర్త మరణిస్తే తప్ప కొత్త పెన్షన్ మంజూరు కాని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమన్నారు. దీంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించి తప్పు చేశామని ప్రజల్లో చర్చ జరుగుతోందని వ్యాఖ్యానించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేసి ప్రతి సామాజిక వర్గానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు ప్రారంభించిన “నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరు” కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళుతుండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల్లో స్పష్టమైన ఆందోళన కనిపిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ రియాజ్ అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధి కదిరి కోట సునీల్ కుమార్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వెంకటాపురం రాజు, మాజీ స్టోర్ చైర్మన్ షాబ్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ షాబుద్దీన్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ సీనియర్ నాయకుడు కె.ఆర్. నటరాజ్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు డిష్ కేశవరెడ్డి, వడ్డే వీరేష్, బంగి శ్రీరామ్, రాళ్లదొడ్డి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం

**డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల కార్యక్రమంలో**

**జిల్లా మలేరియా అధికారి ఆర్ రామచంద్ర రెడ్డి మరియు డాక్టర్ మనోజ్ కుమార్ వైద్యాధికారి**




**లక్కిరెడ్డిపల్లి జూలై 17 ప్రజా జ్యోతి** లక్కిరెడ్డిపల్లి సబ్ యూనిట్ పరిధిలో గల గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము అరవీడు కస్పా, హరిజనవాడ, లో ఆధ్వర్యంలో వైద్య శిబరం మరియు ర్యాలీ నిర్వహించడం మరియు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఆర్ రామచంద్ర రెడ్డి గారు. మాట్లాడుతూ ఈ జులై నెల ఒకటవ తారీఖు నుండి 31 తారీఖు వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవములు జరుగుచున్నవి. డెంగ్యూ అనేది ‘ ఏడిస్ ‘ (ూవసవం) దోమలు కుట్టడం వల్ల వచ్చే ప్రమాదకర వైరల్ జ్వరం. దీనివల్ల తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, ప్లేట్‌లెట్ల (రక్తకణాలు) సంఖ్య పడిపోవడం జరుగుతుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీనిని సులభంగా నివారించవచ్చును. డెంగ్యూ జ్వరం గురించి మీరు తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు.డెంగ్యూ లక్షణాలు దోమ కుట్టిన 4 నుండి 10 రోజులలో ఈ క్రింది లక్షణాలు కనిపిస్తాయి: ఆకస్మికంగా వచ్చే అధిక జ్వరం (104-105 డిగ్రీల వరకు), తీవ్రమైన తలనొప్పి మరియు (ఎముకలు విరిగినట్లు అనిపించడం), వాంతులు, వికారం మరియు శరీరంపై ఎర్రటి దద్దుర్లు రావడం. దోమలు ఎక్కడ పెరుగుతాయి? ఈ దోమలు మురికి నీటిలో కాకుండా, స్వచ్ఛమైన నిల్వ ఉన్న నీటిలో మాత్రమే పెరుగుతాయి. కూలర్లు కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, మరియు కుండీలలో నిల్వ ఉండే నీరు వీటి నివాసాలు. తీసుకోవాల్సిన- జాగ్రత్తలు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం: ఇంటి పరిసరాలలో నీరు నిల్వఉండనివ్వకండి. ఉండనివ్వకండి. దోమల నివారణ : నిద్రపోయేటప్పుడు దోమల తెరలను ఉపయోగించండి. పూర్తి చేతులు, కాళ్ళు కప్పే దుస్తులు ధరించండి. దోమల మందులు: దోమలు కుట్టకుండా ఉండే క్రీములు లేదా లోషన్లు వాడండి. చికిత్స మరియు ఆహారం జ్వరం రాగానే సొంత వైద్యం చేసుకోకుండా, వెంటనే వైద్యుడిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోండి. డెంగ్యూ సమయంలో శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. కాబట్టి, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, బొప్పాయి ఆకు రసం, కివీ పండు, మరియు దానిమ్మ తీసుకోవడం ద్వారా ప్లేట్‌లెట్ల సంఖ్యను వేగంగా పెంచుకోవచ్చునని తెలిపారు. అలాగే మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధి, బోధకాలు వ్యాధి వంటి వ్యాధుల గురించి మరియు నివారణ చర్యలు గురించి ప్రజలకు ఆరోగ్య విద్యను బోధించడం ల్యాబ్ నూడి. బాలయ్య నూ అడిగి వాల్ చార్టులు మరియు రికార్డు లాను తనిఖీ చేసి పరిశీలించటం జరిగినది.ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లిసబ్ యూనిట్ అధికారి జి. జయరామయ్య గారు,జయచంద్ర గారు,చంద్రకళ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్. హెల్త్ సూపర్ వైజర్ యం సూరంద్రారెడ్డి ఆరోగ్య కార్యకర్తల మల్లికార్జున శోభా ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వివాదంలో ఆర్ ఎస్ ప్రవీణ్

**అదిలాబాద్ :** కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద.. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు.. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యంగా గురుకులాల విషయంలో ప్రవీణ్ తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వేలకోట్ల కుంభకోణం జరిగిందని.. ఇదంతా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర అని ప్రవీణ్ కుమార్ మండిపడుతున్నారు. రోజుల వ్యవధిలోనే అనేకసార్లు విలేకరుల సమావేశం నిర్వహించి.. ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా భారతీయ జనతా పార్టీ నుంచి కౌంటర్ వచ్చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకుడు గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు.. గురుకులాల నిర్వహణ.. నిధుల ఖర్చు ఇటువంటి వాటిపై గువ్వల బాలరాజు కీలకమైన ఆధారాలు బయటపెట్టారు. 2013 నుంచి 2021 మధ్యకాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు భారీగా అక్రమాలు జరిగాయని.. దాదాపు పదివేల కోట్ల వరకు ప్రజాధనం పక్కదారి పట్టిందని గువ్వల బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు తాను ముఖ్యమంత్రికి ఒక లెటర్




రాశారు. టెండర్ ప్రక్రియలు మొత్తం పక్కన పెట్టి.. నిధులను సంతానికి మళ్ళించుకున్నారని బాలరాజు ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ సాగించాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం ప్రవీణ్ కుమార్ ను మాత్రమే కాకుండా.. నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును కూడా బాలరాజు న్యాయపరంగా లక్ష్యంగా చేసుకున్నారు. నాడు జరిగిన అక్రమాలకు కేసీఆర్ మద్దతు ఉందని.. ఆయన సపోర్టుతోనే ఇవన్నీ జరిగాయని బాలరాజు ఆరోపించారు. ఐపీఎస్ కేడర్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన గురుకుల సెక్రటరీ విధులను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కు ఏకంగా 10 సంవత్సరాల పాటు అప్పగించడం వెనక ఉన్న నిజాలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా ప్రవీణ్ సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మరోవైపు బాలరాజు ముఖ్యమంత్రికి రాసిన లేఖ.. చేసిన విమర్శలపై ప్రవీణ్ కుమార్ కూడా ఆదే స్థాయిలో స్పందించారు. ఇదంతా అబద్ధమని అన్నారు. కేవలం ఎనిమిది వందల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న గురుకులాలలో వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రవీణ్ ప్రశ్నించారు.. బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయాలని బాలరాజుకు చూపించారు. బాలరాజు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి.. బండి సంజయ్.. బాలరాజు తను లక్ష్యంగా చేస్తున్నారని.. ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు .

### పురుషులను గౌరవించడం మన సంప్రదాయం'..

# ఫ్రీ బస్ వేళ ఆర్టీసీ బస్సులో ఇంట్రెస్టింగ్ బోర్డు

**నల్గొండ :** ఆర్టీసీ బస్సులో 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో సూర్యాపేట రూట్ బస్సులో తీసిందిగా ప్రచారం జరుగుతుండగా.. దీనిపై నెటిజన్లు సరదాగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ఈ బోర్డు నిజమైనదా లేదా ఏఐ, డిజిటల్ ఎడిటింగ్‌తో రూపొందించారా అనే విషయంపై స్పష్టత లేదు. తెలంగాణ ఆర్టీసీ కూడా ఇప్పటివరకు దీనిపై అధికారికంగా స్పందించలేదు.తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులు, ప్రయాణాలకు సంబంధించిన పోస్టులు, మహిళల కొట్లాటలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ ఆర్టీసీ బస్సులో కనిపించిన బోర్డు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా బస్సుల్లో కనిపించే 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అనే సందేశానికి బదులుగా ' పురుషులను గౌరవించడం మన సంప్రదాయం ' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ఈ ఫొటో సూర్యాపేట రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సులో తీసింది అని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. దీంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. "ఇన్నాళ్లకు మాకు కూడా గౌరవం దక్కింది", "ఇకపై బస్సులో సీటు దొరికే అవకాశముంది" అంటూ కొందరు పురుషులు సరదాగా ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఈ బోర్డు నిజంగా ఆర్టీసీ ఏర్పాటు చేసిందా లేక ఎవరైనా సరదాగా మార్చారా అంటూ



సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ ఫొటో నిజమైందా కాదా అనేది మాత్రం స్పష్టత లేదు. కొందరు నెటిజన్ల అభిప్రాయం ప్రకారం.. అసలు బోర్డుపై ఉన్న స్త్రీలను అనే పదాన్ని డిజిటల్ ఎడిటింగ్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో 'పురుషులను'గా మార్చి సోషల్ మీడియాలో వైరల్ చేశారని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ బోర్డు నిజమైందా లేక ఎడిట్ చేసిందా అనే దానిపై తెలంగాణ ఆర్టీసీ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉన్న నేపథ్యంలో బస్సుల్లో సీట్ల కొరత, ప్రయాణ అనుభవాలపై ఇప్పటికే సోషల్ మీడియాలో అనేక మీమ్స్, ట్రోల్స్, పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఈ బోర్డు కూడా వైరల్ కావడంతో.. మరోసారి చర్చనీయాంశంగా మారింది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి ఫొటోను నిజమని నమ్మే ముందు అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సాఫ్ట్ వేర్ నుంచి సాగువైపు

**నిజామాబాద్ :** నేటి తరం యువత చదువు పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనో.. లక్షలు ఖర్చు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా, లండన్ వంటి విదేశాలకు వెళ్లాలనో కలలు కంటుంది. కానీ.. తెలంగాణకు చెందిన ఒక సాధారణ రైతు బిడ్డ మాత్రం ఆ గ్లామరస్ ఐటీ ప్రపంచాన్ని, విదేశీ అవకాశాలను కాలదన్ని తాను పుట్టిన మట్టిలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన సంజనా రెడ్డి సరికొత్త అగ్రి ఎంట్రపెన్యూర్‌గా మారి నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమె సక్సెస్ జర్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా.. లక్షలాది మంది నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.సంజనా రెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి ఐటీ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలనే లక్ష్యంతో ఎఇఒ్యూ, ఉఖీఇ పరీక్షలు రాసి, మంచి స్కోర్‌తో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో అడ్మిషన్ కూడా సాధించింది. అంతా సిద్ధమై అమెరికాకు పయనమయ్యే సమయంలో ఆమె తనను తాను ఓ ప్రశ్న వేసుకుంది. 'ఉన్నత చదువుల కోసం నా సొంత ఊరిని, దేశాన్ని విడిచి విదేశాలకు ఎందుకు వెళ్లాలి ? నేను చదువుకున్న చదువును, టెక్నాలజీని



ఇక్కడే నా కళ్ల ముందే ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎందుకు ఉపయోగించకూడదు ?' అని ఆలోచించింది.

తాను ఒక రైతు బిడ్డ కావడంతో చిన్నతనం నుండి రైతులు పడే కష్టాలను, నష్టాలను సంజన కళ్లారా చూసింది. నెలల తరబడి ఎండనక, వాననక కష్టపడి పంట పండిస్తున్నప్పటికీ దళారీల వల్ల, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని గ్రహించింది. ఈ సమస్యకు టెక్నాలజీ, వ్యాపార ఆలోచనలతో చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తను రోజూ పొలంలో చేసే పనులను, వ్యవసాయ జీవన విధానాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. అలా ఆమె పోస్ట్ చేసిన పసుపు సాగు గురించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రజలు నేరుగా తమ పొలం నుంచే స్వచ్ఛమైన పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.ఈ ఊహించని అవకాశాన్ని వ్యాపారంగా మార్చుకుంటూ ఆమె 'ఇందూరు ఫార్మ్స్' అనే ఈ-కామర్స్ స్టార్టప్‌ను ప్రారంభించింది. రైతుల నుంచి పంటను నేరుగా ఎటువంటి దళారీల ప్రమేయం లేకుండా మంచి ధరకు కొనుగోలు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించింది. నేడు ఈమె వ్యాపారం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై వంటి దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు విస్తరించింది.సంజన విజయగాథపై సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఎక్కడ పుట్టిందో.. ఆ మూలాల నుంచే ఎదగాలని నిర్ణయించుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకమని అంటున్నారు. నిజమైన మార్పు ఎప్పుడూ మూలాల నుంచే మొదలవుతుందని.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఇంత పెద్ద వ్యాపారాన్ని నిర్మించడం అద్భుతమని, తాను జీవితాంతం చూసిన సమస్యకు టెక్నాలజీతో పరిష్కారం కనుగొన్న సంజన నిజమైన ఎంట్రప్రెన్యూర్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. రైతు కూతురిగా మొదలైన ఆమె ప్రయాణం.. నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా మారిందని ప్రశంసిస్తున్నారు. నిజంగా సంజనా ప్రయాణం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం.

## డీ లిమిటేషన్ బిల్లుకు కాంగ్రెస్ సపోర్టా....

**హైదరాబాద్ :** తెలంగాణా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మరో రెండు టెర్ములు తనదే అధికారం అని ప్రతీ సభలో చెబుతూ ఉంటారు. రాసి పెట్టుకోండి అని ఆయన అంటున్నారు. ఇక తాజాగా ఆయన ఖమ్మం సభలో అయితే మీడియాకు నంబర్ చెప్పి మరీ మాకు 2029 లో వచ్చే సీట్లు ఇవ్వే లెక్క కరెక్ట్ అని పక్కాగా చెప్పారు. మాకు 117 సీట్లు వస్తాయని ఆయన అన్నారు. తెలంగాణాలో సీట్లు 182 దాకా పెరుగుతాయని అందులో 117 ఒక్క కాంగ్రెస్ కే సొంతంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. : ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డిని ఎవరు తక్కువగా అంచనా వేసినా పప్పులో కాలేసినట్లే అని అంటున్నారు. అలాగే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేతలు లైట్ తీసుకున్నారు. దానికి గానూ ఏకంగా భారీ మూల్యం చెల్లించి గద్దె దిగాల్సి వచ్చింది. మరి ఇపుడు చూస్తే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రభుత్వం నడుపుతున్నారు. పైగా కాంగ్రెస్ అధినాయకత్వం వద్ద ఆయనకు మంచి పేరు ఉంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఆయనకే ఓటు వేస్తున్నారు. దాంతో మరో రెండు సార్లు కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని వస్తామని రేవంత్ తన వద్ద ఉన్న అంచనాలతోనే చెబుతున్నారు: తెలంగాణాలో ప్రస్తుతం 119 సీట్లు ఉన్నాయి. అవి ఏకంగా 182 దాకా అవుతాయని రేవంత్ రెడ్డి లెక్క కడుతున్నారు. ఇలా సీట్లు మరో డెబ్బై దాకా పెరిగితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే అనుకూలిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఎపుడూ అధికారంలో ఉండే పార్టీకే ఈ సీట్ల పెరుగుదల అడ్వాంటేజ్ గా ఉంటుంది అని అంటున్నారు. 2009 లో అసెంబ్లీ సీట్ల పునర్ విభజన వైఎస్సార్ కి బాగా కలిసి వచ్చింది. ఇపుడు కూడా రేవంత్ రెడ్డి అదే జరుగుతుందని భావిస్తున్నారు అంటున్నారు.ఇక రాజకీయంగా చూస్తే వ్యతిరేక ఓట్లు భారీగా వచ్చే ఎన్నికల్లో చీలిపోతాయని కూడా రేవంత్ రెడ్డి అంచనా కడుతున్నారు. విపక్షంలో బీజేపీ బీఆర్ఎస్ రెండూ పోటా పోటీగా ఉన్నాయి. ఈ రెండూ కలిసేది లేదు అని అంటున్నారు. కలుస్తాయని అందుకే పెద్ద ఎత్తున రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. ఇదంతా వ్యూహాత్మకం అని అంటున్నారు. ఈ రెండు పార్టీ కలిసినా అప్పటికి అది బూమరాంగ్ అవుతుందని విడిగా పోటీ చేస్తే కనుక కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీని పంచుకుంటాయని దాంతో మరోసారి గెలుపు బాట కాంగ్రెస్ దే అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమాతో ఉన్నారు అని అంటున్నారు.

## అటవీ అధికారులపై దాడి కేసు..
## మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సహా 8 మందికి జైలు శిక్ష

**అదిలాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సార్సాలలో అటవీ శాఖ అధికారులపై జరిగిన దాడి కేసులో అటవీ అధికారుల పోరాటం ఫలించింది. విధి నిర్వహణలో ఉన్న అటవీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసి, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసులో ఎట్టకేలకు ఆదిలాబాద్ కోర్టులో తుది తీర్పు వెలువడింది. ఆనాటి ఈఖీూ చోళే అనితపై కొందరు వ్యక్తులు అమానుషంగా దాడి చేసిన ఘటనకు సంబంధించి కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘ విచారణల తర్వాత.. ఆసిఫాబాద్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్ తో పాటు మరో ఏడుగురిని దోషులుగా నిర్ధారిస్తూ న్యాయస్థానం జైలు శిక్ష ఖరారు చేసింది.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాల అటవీ అధికారులపై దాడి కేసులో 7 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. 2019లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 8 మంది నిందితులను దోషులుగా నిర్ధారించి, ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. 2019 జూన్ 30న ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కొత్త సార్సాలలో అటవీ భూమిలో మొక్కలు నాటేందుకు అధికారులు సిబ్బంది వెళ్లారు. దీంతో అక్కడి గ్రామస్థులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అప్పటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చోళే అనిత నేతృత్వంలోని బృందంపై కొందరు వ్యక్తులు కర్రలతో దాడి చేయగా, ఎఫ్.ఆర్.ఓ అనితతో పాటు పలువురు అటవీ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. అటవీశాఖ సిబ్బందిపై దాడి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొత్తం 39 మందిపై హత్యాయత్నం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, దాడి, తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు పూర్తిచేసి 2020లో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా 300 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఆసిఫాబాద్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్, భూరం పోసం, పుల్ల శ్రీకాంత్, కొట్ట మల్లేష్, బొబ్బర శంకర్, రాజశేఖర్, భూరం మల్లేష్, శ్యామలను దోషులుగా తేల్చి 6 నెలల జైలు శిక్ష విధించింది. ఏడేళ్ల న్యాయ పోరాటం అనంతరం వెలువడిన ఈ తీర్పుతో అటవీ శాఖ అధికారులు తమకు కోర్టులో న్యాయం జరిగిందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడులను సహించబోమనే స్పష్టమైన సందేశాన్ని కోర్టు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కేసు విచారించిన ఆదిలాబాద్ లోని ఎస్సీ, ఎస్టీ జిల్లా న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దానియా రుతు తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. రమణారెడ్డి ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించగా, ప్రస్తుత కాగజ్ నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్ నోడల్ ఆఫీసర్ గా ఉన్నారు. కాగజ్ నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఈశ్వర్ సింగ్ లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారణ సజావుగా జరిగేలా చేశారు.

## అల్పపీడనం... పలు ప్రాంతాల్లోవానలు

**హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీనికి తోడు కోస్తాంధ్ర, తెలంగాణ మీదుగా మహారాష్ట్ర వరకు ప్రస్తుతం ద్రోణి విస్తరించి ఉంది. ఈ మార్పుల ప్రభావంతో శుక్రవారం ఏపీ వ్యాప్తంగా ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణశాఖ అధికారులు స్పష్టం చేశారు. గంటకు 40- 50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. వర్షం కురుస్తున్నప్పుడు, ఉరుములు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని, తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యంతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మిగిలిన జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉత్తర ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ గురువారం తెలిపింది. అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో శుక్రవారం నాడు ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది. ఈ జిల్లాల్లో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని ప్రజలను అప్రమత్తం చేసింది. శనివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.మరోవైపు, తెలంగాణలో నిన్న పలు జిల్లాల్లో అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు, తేలికపాటి జల్లులు కురిశాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 4.3 సెంటీమీటర్లు, నల్గొండ జిల్లా చండూరులో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్ష సూచన ఉన్నప్పటికీ పలు జిల్లాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా నిజామాబాద్‌లో గరిష్టంగా 35.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది ఈ సమయంలో సాధారణం కంటే 3.5 డిగ్రీలు అధికమని తెలిసిందే.

## తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న మంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు.మంత్రి త్వరగా కోలుకోవాలని అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు మంత్రి వాకిటి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వాకిటి శ్రీహరి త్వరగా పూర్తి కోలుకుని ప్రజా సేవలో కొనసాగాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

## పాదయాత్రలకు నేతలు..

**హైదరాబాద్ :** మరో ఏడాది తర్వాత తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పాదయాత్రల సందడి మొదలుకానుంది. ఎన్నికలకు ముందు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు మరోసారి పాదయాత్రలను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఎంచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రెండేళ్ల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతానని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు తెలంగాణలో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రధాన పార్టీలు ప్రజలతో నేరుగా మమేకమయ్యే వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల రాజకీయాల్లో ఈ పాదయాత్రలు కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.జగన్‌కు పాదయాత్ర కొత్త కాదు. 2019 ఎన్నికలకు ముందు 2017 నవంబర్‌లో ప్రారంభించిన 'ప్రజా సంకల్ప యాత్ర'ను 2019 జనవరిలో ముగించారు. 341 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో ఆయన 3,648 కిలోమీటర్లకు పైగా నడిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకున్నారు. ఆ పాదయాత్ర అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు.మరోవైపు కేటీఆర్ కు ఇది తొలి పాదయాత్ర కానుంది. ఇప్పటివరకు ఆయన రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిపక్ష పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయిలో పునర్వ్యవస్థీకరించేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడం, రానున్న ఎన్నికలకు సంస్థాగతంగా సిద్ధమవడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. ప్రజల స్పందనను బట్టి ఈ యాత్రలు రానున్న ఎన్నికల రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బిజినెస్

## కీలక రంగాల్లోకి ఐరన్ ఓర్



**న్యూఢిల్లీ :** కీలక రంగాల సూచీకి ఐరన్ ఓర్ ఉత్పాదకతనూ కేంద్ర ప్రభుత్వం జత చేసింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును మరింత సమర్థవంతంగా అంచనా వేయవచ్చని శుక్రవారం తెలిపింది. ఇప్పటిదాకా నెలనెలా కీలక రంగాల సూచీ లెక్కింపునకు 8 ఇండస్ట్రీల (ముడి చమురు, చమురు శుద్ధి, సహజ వాయువు, విద్యుత్తు, ఎరువులు, ఉక్కు, బొగ్గు, సిమెంట్) పనితీరునే ప్రాతిపదికగా తీసుకొనేవారు. ఇకపై ఇనుప ఖనిజం ఉత్పత్తిని కూడా పరిగణనలోకి తీసుకుంటారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త సిరీస్ గణాంకాలు 2022-23 ఆధారంగా ఉంటాయి. 20న 9 కీలక రంగాల ఫలితాలు విడుదల కానున్నాయి.

## రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కే రూ.67 లక్షలా?



దేశంలోని ప్రముఖ ఐఐటీల విద్యార్థులకు కేవలం రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కే రూ.67 లక్షల సీటీసీ (+తీశీం జుజ) ఆఫర్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ నియామక ప్రకటన తీవ్ర చర్చకు దారితీసింది. అంశంపై విద్యార్థులు, టెక్ నిపుణులు పెద్దఎత్తున చర్చిస్తున్నారు. వైరల్ పోస్టు ప్రకారం.. హర్యానాలోని గురుగ్రామ్‌లో క్వాంటిటేటివ్ స్ట్రాటజిస్ట్ ఇంటర్న్ పోస్టులకు ప్రీ-ఫైనల్ ఇయర్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో నెలకు రూ.30 లక్షల స్టైపెండ్, రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కు మొత్తం రూ.67 లక్షల గ్రాస్ సీటీసీ పేర్కొన్నట్లు కనిపిస్తోంది. బీఎస్-ఎంఎస్ (మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్), బీటెక్ (సీఎస్ఈ, ఈఈ, డీఎస్ఏఐ, ఈసీఈ తదితర విభాగాలు) చదువుతున్న, కనీసం 8.5 సీజీపీఏ ఉన్న విద్యార్థులు అర్హులని పోస్టులో పేర్కొన్నారు. అయితే వైరల్ స్క్రీన్‌షాట్‌లో సంస్థ పేరు స్పష్టంగా లేకపోయినా, పలువురు నెటిజన్లు ఇది గురుగ్రామ్‌కు చెందిన ప్రముఖ క్వాంటిటేటివ్ ట్రేడింగ్ సంస్థ 'క్వాడెయా' (ఋఖుఽవవవ)కు సంబంధించినదై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. దీనికి కారణం, ఆ సంస్థ అధికారిక కెరీర్ పేజీలో ప్రస్తుతం ఇంటర్న్- క్వాంట్ స్ట్రాటజిస్ట్ పోస్టుకు నియామకాలు కొనసాగుతుండటమే. అయితే అక్కడ ఇంటర్న్‌షిప్ స్టైపెండ్ వివరాలు వెల్లడించలేదు. పూర్తి స్థాయి ఉద్యోగంగా ఎంపికైతే కనీసం రూ.93 లక్షల వార్షిక వేతనం (జుజ) ఉంటుందని మాత్రమే పేర్కొంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇది అగ్రశ్రేణి హై-ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ (ఎఖీ), క్వాంట్ ట్రేడింగ్ సంస్థల్లో అసాధారణం కాదని చెబుతుండగా, మరికొందరు వైరల్ స్క్రీన్‌షాట్‌లోని గణాంకాలను స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలు లేవని పేర్కొంటున్నారు. ప్రస్తుతం రూ.67 లక్షల ఇంటర్న్‌షిప్ సీటీసీపై సంబంధిత సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# సూచీలకు బ్లూచిప్స్ సంస్థల దన్ను..

## ఒక్కశాతానికి పైగా లాభపడిన మార్కెట్లు



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపర్ల నుంచి లభించిన మద్దతుతో పాటు బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లు దౌడ్‌తీయడంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 964.58 పాయింట్లు లేదా 1.25 శాతం ఎగబాకి 78,151.45 వద్ద నిలిచింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 261.55 పాయింట్లు లేదా 1.09 శాతం బలపడి 24,334.30 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం కావడం, బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు మదుపర్లలో ఉత్సాహాన్నినింపిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులతో పోలిస్తే దేశీయ మదుపర్లు భారీగా నిధులు కుమ్మరించడం సూచీల ర్యాలీకి కలిసొచ్చిందన్నారు. మొత్తంమీద ఈ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 582.06 పాయింట్లు, నిఫ్టీ 127.4 పాయింట్లు బలపోతేం అయ్యాయి. నేటి సూచీల్లో టెక్ మహీంద్రా అత్యధికంగా 3.91 శాతం ఎగబాకగా, కొటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రంగాలవారీగా బ్యాంకెక్స్, ఐటీ, ఫోకస్డ్ ఐటీ, ఆర్థిక సేవల రంగ షేర్లు నష్టపోగా..కమోడిటీస్, ఇండస్ట్రియల్స్, టెలికాం, మెటల్ రంగ షేర్లు నష్టపోయాయి. ఇంధన ధరలు భారీగా తగ్గడం కూడా సూచీలకు కిక్కునిచ్చింది. కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలు, ప్రైవేట్ రంగ బ్యాంకుల షేర్లు కూడా లాభాల్లో ముగియడం కూడా కలిసొచ్చింది.

# నిరాశపరిచిన రిలయన్స్..

**క్యూ1లో 22 శాతం తగ్గిన ప్రాఫిట్**
**రూ.20,946 కోట్లకు పరిమితం**

**న్యూఢిల్లీ :** చమురు నుంచి టెలికాం వరకు సేవలు అందిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.20,946 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని నమోదుచేసుకున్నది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.26,994 కోట్ల లాభంతో పోలిస్తే 22 శాతం తగ్గుదల నమోదు చేసుకున్నది. ఏషియన్ పెయింట్స్‌లో షేర్లను విక్రయించడంతో ఒకేసారి భారీగా రూ.8,942 కోట్ల ఆదాయం సమకూరడంతో గతేడాది రికార్డు స్థాయి లాభాలను ఆర్జించిది సంస్థ. చమురు నుంచి కెమికల్స్, టెలికాం రంగాలు అంచనాలకుమించి రాణించడం వల్లనే ఈ మాత్రమైన లాభాలను నమోదు చేసుకున్నట్టు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 24.5 శాతం అధికమై రూ.3,40,257 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది.





**జియో లాభం 7,764 కోట్లు**

దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో అంచనాలకుమించి రాణించింది. జూన్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.7,764 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.7,110 కోట్ల లాభంతో పోలిస్తే 9.2 శాతం వృద్ధిని కనబరిచింది. మార్కెట్ వాటా పెరగడం, కస్టమర్ నుంచి వచ్చే ఆదాయం అధికమవడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 11.8 శాతం అందుకొని రూ.39,173 కోట్లకు చేరుకున్నది. సరాసరిగా ఒక్కో కస్టమర్ నుంచి వచ్చే ఆదాయం 3.3 శాతం అధికమై రూ.215.6కి చేరుకోవడం కంపెనీకి కలిసొచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 53.3 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. డిజిటల్ కామర్స్ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఇతర రంగాలు నేలచూపులు చూస్తున్నదని, ముఖ్యంగా రిటైల్ రంగంలో వృద్ధి ఫ్లాట్‌గా ముగిసినట్టు పేర్కొంది.

గడిచిన త్రైమాసికంలో సంస్థ రూ.38, 682 కోట్ల పెట్టుబడులు పెట్టగా, రూ.41, 254 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.

అలాగే జూన్ చివరినాటికి కంపెనీకి రూ.1,22,914 కోట్ల రుణాలు ఉన్నాయి.

రిలయన్స్ రిటైల్ విభాగం రూ.90,408 కోట్ల ఆదాయంపై రూ.2,806 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

# రెండో వన్డేలో భారత్‌పై గెలిచిన ఇంగ్లాండ్



కార్డిఫ్ వేదికగా భారత్?తో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో గెలిచింది. భారత్ నిర్దేశించిన 234 పరుగుల టార్గెట్?ను ఆతిథ్య ఇంగ్లాండ్ 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో జో రూట్ (99 పరుగులు నాటౌట్) రాణించాడు. టీమ్ఇండియా బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 2, బుమ్రా, ప్రసిద్ద్, దూబె, అక్షర్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం అయ్యింది. ఇరుజట్ల మధ్య మూడో వన్డే జులై 19న లార్డ్స్ వేదికగా జరగనుంది.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 44 ఓవర్లలోనే 233 పరుగులకు ఆలౌటైంది. శ్రేయస్ అయ్యర్ (66 పరుగులు), విరాట్ కోహ్లీ (65 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ శుభ్?మన్ గిల్ (31 పరుగులు), రోహిత్ శర్మ (26 పరుగులు) చేశారు. చివర్లో జస్ప్రీత్ బుమ్రా (20 పరుగులు నాటౌట్ 3 ఫోర్లు, 1 సిక్స్?) మెరుపులు మెరిపించాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఇషాన్ కిషన్ (1), వాషింగ్టన్ సుందర్ (2), అక్షర్ పటేల్ (1), శివమ్ దూబె (0), గుర్నూర్ బ్రార్ (7), ప్రసిద్ధ్ కృష్ణ (0) ఫెయిల్ అయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్ చెరో 3, సాదిక్ మహ్మద్ 2, శామ్ కరన్, విల్ జాక్స్ తలో 1 వికెట్ పడగొట్టారు.

### 233 పరుగులకే ఆలౌటైన టీమ్ఇండియా

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఇండియా గెలుపొందగా, రెండో వన్డేలో మాత్రం అనూహ్యంగా పరాజయం పాలైంది. ఇండియా కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి అనంతరం ముగిసిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా 4 వికెట్ల తేడాతో ఓడి అభిమానులను షాక్?కు గురి చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా ఇన్నింగ్స్‌ను చక్కగా ఆరంభించి, ఒక దశలో అలవోకగా 300 స్కోరు చేసే స్టేజ్?లో కనిపించింది. 30 ఓవర్ల వరకు పూర్తి ఆధిపత్యం సాధించిన భారత్ జట్టు ఆ తర్వాత మాత్రం తన దూకుడును కొనసాగించలేకపోయింది. ఫామ్‌లేక నానా తంటాలు పడుతున్న రోహిత్ (26; 47 బంతుల్లో 1ఐ4, 1ఐ6) అవతలి ఎండ్‌లో అంత సౌకర్యంగా కనిపించలేదు. కెప్టెన్ శుభ్‌మన్ (31; 30 బంతుల్లో 6ఐ4) మాత్రం ఫర్వాలేదనిపించాడు. కానీ జోరుమీదున్న గిల్‌ను అట్కిన్సన్ ఔట్ చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో మూడో స్థానంలో వచ్చిన కోహ్లి నిలకడైన ఆట తీరుతో జట్టును మెరుగైన స్థితిలో నిలిచేలా చేశాడు.

విరాట్ కోహ్లీ మంచి డ్రైవ్ షాట్లు ఆడుతూ బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్ అట్కిన్సన్ బౌలింగ్‌లో ఒక సిక్సర్ కొట్టినప్పటికీ, ఆ తర్వాత అతని జోరు తగ్గింది. అంతేకాకుండా స్పిన్నర్ జాక్స్ బౌలింగ్‌లో రోహిత్ స్వీప్ చేయబోయి చివరకు వికెట్ కీపర్‌కు దొరికిపోవడంతో మొత్తం 104 పరుగుల వద్ద టీమ్?ఇండియా తన రెండో వికెట్?ను కోల్పోవాల్సి వచ్చింది. కాసేపటికే ఇషాన్ (1) కూడా ఔటైపోయినా సరే కోహ్లీకి శ్రేయస్ జతకలవడంతో భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. ఇద్దరూ నిలకడగా ఆడుతూ జట్టును స్ట్రాంగ్? చేశారు. కోహ్లి సరిగ్గా 50 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. శ్రేయస్ సైతం అర్ధసెంచరీకి దగ్గర్లోకి రాగా, 31 ఓవర్లకు భారత్ 177/3తో 300 స్కోరును టార్గెట్ చేసింది. అయితే ఆ తర్వాత ఓవర్లో ఆర్చర్ కోహ్లిని ఔట్ చేయడంతో ఆట సరికొత్త మలుపు తిరిగింది. ఇక ఆ తర్వాత వికెట్లు ఒక్కొక్కటి పడుతూ వచ్చాయి. దాంతో 6 ఓవర్లు ఉండగానే ఈ ఇన్నింగ్స్‌కు తెరపడింది. మొదటగా జోఫ్రా ఆర్చర్ (3/47), గస్ అట్కిన్సన్ (3/50), సకిబ్ మహమూద్ (3/52)ల ధాటికి భారత్ 44 ఓవర్లలో 233 పరుగులకే టీమ్ మొత్తం ఆలౌటైంది.

### ఇంగ్లాండ్‌ను గెలిపించిన జోరూట్

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ మొదట్లోనే పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు బెన్ డకెట్ (0), జాకబ్ బెతెల్ (4) ఆరంభంలోనే ఔటైపోవడం, కెప్టెన్ బ్రూక్ (16) కూడా ఎక్కువసేపు నిలవకపోవడంతో ఇంగ్లాండ్ 53/3తో కష్టాల్లో పడింది. అయితే తొలి వన్డేలో మాదిరిగానే జో రూట్ ఆత్మవిశ్వాసంతో నిలవడంతో ఇంగ్లాండ్ విన్నింగ్?కు దారులు తెరుచుకున్నాయి. జో రూట్ (99 నాటౌట్; 133 బంతుల్లో 9ఐ4) సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. సామ్ కరన్ (26), జోస్ బట్లర్ (17), విల్ జాక్స్ (30), గస్ అట్కిన్సన్ (23 నాటౌట్)ల సహకారంతో రూట్ తన జట్టును గెలిపించాడు. బుమ్రా (1/45), అక్షర్ పటేల్ (1/35), గుర్నూర్ బ్రార్ (2/67), ప్రసిద్ధ్ కృష్ణ (1/52) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్‌పై ఒత్తిడి తెచ్చినప్పటికీ రూట్ గొప్ప పట్టుదలతో ఆటను నడిపించాడు. దీనితో 234 పరుగుల లక్ష్యాన్ని 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఇంగ్లాండ్? ఛేదించింది.

# స్పోర్ట్స్

## సెమీస్‌కు సింధు



టోక్యో: జపాన్ ఓపెన్‌లో తెలుగమ్మాయి పీవీ సింధు సెమీస్‌కు ప్రవేశించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్ పోరులో భాగంగా శుక్రవారం నొజొమి ఒకుహరతో సింధు తలపడాల్సింది. కానీ, కాలి గాయం కారణంగా జపాన్ ప్లేయర్ వాకోవర్ ఇవ్వడంతో సింధు సెమీస్‌కు అర్హత సాధించింది. కాగా జపాన్ ఓపెన్‌లో సింధుకు ఇదే తొలి సెమీస్. 2023 డెన్మార్క్ ఓపెన్ 750లో లాస్ట్-4కు చేరుకున్న తర్వాత బీడబ్ల్యూఎఫ్ 750 ఈవెంట్‌లో సెమీఫైనల్స్‌కు వెళ్లడం మూడేండ్ల తర్వాత ఆమెకు ఇది మొదటిసారి. సెమీస్‌లో ఆమె.. చైనాకు చెందిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యూఫీతో తలపడనుంది. ఈ ఇద్దరి మధ్య ముఖాముఖి పోరుల్లో చైనా షట్లర్ 8-6తో ముందంజలో ఉండటం గమనార్హం.

## 'ఎక్కడికీ పోయేది లేదు'

## రోహిత్ రిటైర్మెంట్ ప్రచారంపై బీసీసీఐ క్లారిటీ



రోహిత్ శర్మ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న హిట్‌మ్యాన్‌కు జులై 19న లార్డ్స్ వేదికగా జరగనున్న వన్డే మ్యాచ్ చివరిది అని జరుగుతున్న ప్రచారంపై స్పష్టత వచ్చింది. ఇవన్నీ ఊహాహానాలే అని బీసీసీఐ కొట్టిపారేసింది. రోహిత్ వన్డే భవిష్యత్ విషయంలో బోర్డు పరిధిలో ఎలాంటి చర్చలు జరగలేదని బీసీసీఐ పేర్కొంది. ఈ మేరకు బోర్డు సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. ఆదివారం లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడో మ్యాచ్ రోహిత్?కు క్యాజువల్ మ్యాచ్?లాంటిదే అని, అందులో ఎలాంటి ప్రత్యేకత లేదని చెప్పారు. ఈ వన్డే తర్వాత కూడా రోహిత్ టీమ్ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడని స్పష్టం చేశారు. "రోహిత్ శర్మ భవిష్యత్తు గురించి మీడియాలో అనేక ఊహాగానాలు వస్తున్నాయి. ఆదివారం లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ రోహిత్‌కు చివరిది అవుతుందనే విషయంపై ఎటువంటి చర్చ జరగలేదు. దీని గురించి నేను స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. భారత వన్డే జట్టులో రోహిత్ ఇప్పటికీ కీలక ఆటగాడు. జట్టు ప్రణాళికల్లో భాగమైనంత కాలం అతడు టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటాడు. క్లుప్తంగా చెప్పాలంటే, హిట్?మ్యాన్?కు లార్డ్స్ వన్డే చివరి మ్యాచ్ కాదు" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పీటీఐతో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. దీంతో రోహిత్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.



# ఈసారి కథ మారింది!


అగ్ర హీరో రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. దాదాపు గత ఏడాదిగా ఈ సినిమాపైనే దృష్టి పెట్టారు రామ్‌చరణ్. 'పెద్ది' హంగామా ముగియడంతో సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయబోయే తదుపరి సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా లాంచింగ్ డేట్, ఇది ఏ జోనర్ కథాంశమనే విషయాలపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్‌ను దర్శకుడు సుకుమార్ లాక్ చేశారని సమాచారం. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది'రంగస్థలం' తరహా రూరల్ డ్రామా కాదని, రామ్‌చరణ్ కోసం దర్శకుడు సుకుమార్ ఈసారి సరికొత్త కథను సిద్ధం చేశారని, నగర నేపథ్యంలో స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందనుంది.



# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?


'కేజీఎఫ్'తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. 'హను-మాన్' విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో 'జై హనుమాన్'ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.

# రాకా కోసం దీపిక సాహసం?



ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం. అంతేకాదు, తన 'ఎనిమిది గంటల పని' నిబంధనను కూడా ఈ సినిమా విషయంలో ఆమె పక్కన పెట్టారని తెలిసింది. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందు, 'రాకా'లో తన పార్ట్ షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని ఆమె నిర్ణయించారట. అటు షూట్‌లో పాల్గొంటూనే ఇటు తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటూ, లొకేషన్‌లో నటిగా, తల్లిగా రెండు బాధ్యతలనూ నిర్వర్తిస్తూ అందరి దృష్టినీ దీపిక ఆకర్షించారట. దీపిక తన జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకునే తీరును చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిస్తున్నారు.





# రాజు.. జాకీ.. రాణి

1990ల కాలంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామా 'కేజేక్యూ'. 'ఖఅఅస్త్ర జీుఎఎఅవ ఌబవవఅ' అనేది ఉపశీర్షిక. దసరా, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్‌శెట్టి హీరోగా, శశి ఓదెల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి స్వర్గీయ కె.కె దర్శకుడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ చిత్ర దర్శకుడు కేకే గత ఏడాది కన్ను మూశారు. ఆయనకు సినిమాపై ఉన్న పాషన్, విజన్‌కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే ప్రచార చిత్రాల వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయని, సినిమా తప్పకుండా ప్రేక్షకులకు ఓకొత్త అనుభూతినిస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. యుక్తి తరేజా కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెస్, సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,